
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
5
బుధవారం 26 నవంబరు 2025



ఏలూరు **ఉష్ణోగ్రతలు**
గరిష్ఠం : 31.0
కనిష్ఠం : 21.0

రోడ్లపై జడ్పీ గళం



ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ సమావేశంలో సభ్యులు రహదారి సమస్యలపై గళమెత్తారు. చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అధ్యక్షతన మంగళవారం ఏలూరులో జరిగిన జడ్పీ సమావేశంలో సభ్యులు సమస్యలు లేవనెత్తారు. రహదారులు, మొంథా తుఫాన్‌తో రైతులకు నష్టం, కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయ ఖాళీలు, విలేజ్ హెల్త్ క్లినిక్ తదితర సమస్యలు ప్రస్తావించారు.

లోపలి పేజీలో

దివ్యాంగుల క్రీడా సమరం



కాళ్లు, చేతులు సహకరించకున్నా ఉరుకులు పరుగులతో పోటీపడ్డారు. కంటిచూపు లేకున్నా లక్ష్యం దిశగా సాగారు. అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా విభిన్న ప్రతిభావంతుల వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో దివ్యాంగులకు క్రీడా పోటీలు ఉత్సాహంగా సాగాయి.

సుబ్రహ్మణ్యేశ్వరుడి కల్యాణం



అత్తిలి వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో షష్ఠి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మంగళవారం రాత్రి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. అర్చకులు ఐలూరి రామం, కృష్ణ ఆధ్వర్యంలో కల్యాణోత్సవాన్ని ఘనంగా జరిపారు. కల్యాణాన్ని తిలకించడానికి పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు.



సీఎం చంద్రబాబు పర్యటన నిమిత్తం సభా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి, ఎమ్మెల్యే ధర్మరాజు, ఆప్కాబ్ చైర్మన్ గన్ని

1న సీఎం చంద్రబాబు పర్యటన ఖరారు

సభా స్థలిని పరిశీలించిన కలెక్టర్ వెట్రిసెల్వి

నిడమర్రు నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉంగుటూరు నియోజకవర్గ పర్యటన ఖరారైంది. డిసెంబరు 1న పెన్షన్ల పంపిణీ, సభ ఏర్పాట్లపై అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. కలెక్టరు వెట్రిసెల్వి, ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, ఆప్కాబ్ చైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు గోపినాథపట్నం, చేబ్రోలు, గొల్లగూడెంలో సభ ఏర్పాట్లకు మంగళవారం వివిధ ప్రాంతాలను పరిశీలించారు. ఈ మూడు ప్రాంతాలలో అనువైన చోట సభాస్థలి ఏర్పాటుకు ఉన్నతాధికారులకు కలెక్టరు నివేదించారు. గొల్లగూడెంలో ప్రజలతో ముఖాముఖి, బహిరంగ సభ, కార్యకర్తలతో సమావేశం, హెలిపాడ్ ఏర్పాటుకు అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు చేపడుతున్నారు. దీనితోపాటు గొల్లగూడెం లేదా చేబ్రోలు గ్రామాలలో సీఎం చంద్రబాబు స్వయంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్ గౌడ, డీఎస్పీ శ్రావణకుమార్, ఆర్డీవో అంబరీష్, కూటమి నేతలు పాల్గొన్నారు.



ఉంగుటూరు విద్యార్థికి మంత్రి పదవి !

- నేడు విద్యార్థులతో అమరావతిలో మాక్ అసెంబ్లీ
- జిల్లా నుంచి ఎమ్మెల్యేలుగా ఏడుగురు విద్యార్థులు
- స్టూడెంట్ అసెంబ్లీ సమావేశాలకు అధికారులకు ఆహ్వానం

ఏలూరు అర్బన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి):రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని పూర్తిగా విద్యార్థులతో రాష్ట్ర విద్యాశాఖ అమరావతి శాసనసభ మీటింగ్ హాలులో బుధవారం స్టూడెంట్ మాక్ అసెంబ్లీ నిర్వహిస్తున్నారు. జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఏడుగురు బాల ఎమ్మెల్యేల నుంచి ఒకరిని మంత్రిగా ఎంపిక చేశారు. ఉంగుటూరు మండలం పెదనింద్రకొలను జడ్పీ హైస్కూలు 9వ తరగతి విద్యార్థి జీజీఎన్ఎస్.ప్రసాద్ మాక్ అసెంబ్లీలో మంత్రిగా వ్యవహరిస్తారు. మాక్ అసెంబ్లీకి జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ముగ్గురు చొప్పున విద్యార్థులు మొత్తం 21మందిని తొలుత ఎంపిక చేశారు. ఆయా సామాజికవర్గాల వారీగా సమతూకం పాటిస్తూ నియోజకవర్గానికి ఒకరు చొప్పున బాల ఎమ్మెల్యే పదవులకు గుర్తించారు. జిల్లా నుంచి మొత్తం ఏడుగురు విద్యార్థులను మాక్ అసెంబ్లీకి ఎంపికచేశారు.

బాల ఎమ్మెల్యేలు వీరే..

దెందులూరు నియోజకవర్గం నుంచి దెందులూరు జడ్పీ హైస్కూలు 8వ తరగతి విద్యార్థి సలాది మణికంఠ, ఏలూరు నుంచి సుబ్బమ్మదేవి మునిసిపల్ హైస్కూలు 10వ తరగతి విద్యార్థిని గంధం లిఖిత, పోలవరం నియోజకవర్గం నుంచి అప్పలరాజుగూడెం ఏపీ రెసిడెన్షియల్ స్కూలు 9వ తరగతి విద్యార్థి కె.నిఖిల్‌సాయి, చింతలపూడి నియోజకవర్గం నుంచి రంగాపురం జడ్పీ హైస్కూలు 10వ తరగతి విద్యార్థిని కె.వంశిక, నూజివీడు నియోజకవర్గం నుంచి గోపవరం జడ్పీ హైస్కూలు 10వ తరగతి విద్యార్థి బి.గోపి నాగచైతన్య, కైకలూరు నియోజకవర్గం నుంచి లింగాల జడ్పీ హైస్కూలు 9వ తరగతి విద్యార్థి బి.ఆస్మితసాయి ఎమ్మెల్యేలుగా వ్యవహరిస్తారు.

13 మందికి సత్కారం

తొలుత ఎంపికైన జాబితాలో మిగిలిన 14 మంది నుంచి దెందులూరు నియోజవర్గానికి చెందిన ఒక విద్యార్థిని అసెంబ్లీ మార్షల్‌గా వ్యవహరించేందుకు ఎంపిక చేశారు. మిగిలిన 13 మంది విద్యార్థులను బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లో నిర్వహించనున్న కార్యక్రమంలో కలెక్టర్ వెట్రిసెల్వి సన్మానిస్తారు. వారికి రాష్ట్ర విద్యాశాఖ పంపిన పతకం, సర్టిఫికెట్లను బహూకరిస్తారు. సంబంధిత విద్యార్థులందరూ కలెక్టరేట్‌లో నిర్వహించే కార్యక్రమానికి బాలురు తెల్లచొక్కా, ఫ్యాంటు, బాలికలు చీరలు ధరించి రావాలని సమగ్రశిక్ష జిల్లా అధికారులు సూచించారు. అమరావతిలో జరిగే మాక్ అసెంబ్లీ కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా వీక్షించేందుకు రావాల్సిందిగా జిల్లాలోని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కలెక్టర్లకు సమగ్రశిక్ష రాష్ట్ర కార్యాలయం నుంచి ఆహ్వానం పంపారు. మరోవైపు భారత రాజ్యాంగ ప్రవేశికను అన్ని పాఠశాలల్లో పేరెంట్స్, టీచర్స్ సమక్షంలో బుధవారం ఉదయం 11 గంటలకు చదవాలని అధికారులు కోరారు.





ఇక.. వాసవీ పెనుగొండ

- పేరుమార్పునకు ప్రభుత్వం నిర్ణయం
- మంత్రి మండలి ఉప సంఘం సిఫారసుకు సీఎం చంద్రబాబు అంగీకారం
- మంత్రి మండలిలో చర్చించాక నోటిఫికేషన్

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

ఆర్య వైశ్యుల ఆరాధ్య దైవం కన్యకా పరమేశ్వరి పుణ్యధామం పెనుగొండ. ఈ క్షేత్రాన్ని 'వాసవి పెనుగొండ'గా మార్పు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. పెనుగొండ మండలం ఇకపై వాసవీ పెనుగొండ మండలంగా మారనుంది. జిల్లా పునర్విభజన మార్పులు, చేర్పులపై ఏర్పాటు చేసిన మంత్రిమండలి ఉప సంఘం ఆ మేరకు సిఫారసు చేసింది. దానికి సీఎం చంద్రబాబు అంగీకరించారు. మంత్రి మండలి సమావేశంలో ఈ అంశంపై చర్చిస్తారు. అనంతరం నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. పెనుగొండ గ్రామం వాసవీ పెనుగొండగా మార్చనున్నారు.

గత ఏడాది ముఖ్యమంత్రి చంద్రబాబు పెనుగొండ వాసవీ మాత ఆలయాన్ని సందర్శించారు. ఆ సమయంలో ఆర్యవైశ్య సంఘం నేతలు పెనుగొండను వాసవీ పెనుగొండగా మార్చాలని కోరుతూ ఆయనకు వినతిపత్రం అందించారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారు. తర్వాత జనసేన అధినేత పవన్ కల్యాణ్ వాసవి ధామ్‌కు వచ్చిన తరుణంలోను ఆయన దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్లారు. ఆ దిశగా ఇప్పుడు అడుగులు పడుతున్నాయి. మంత్రివర్గ ఉపసంఘం సిఫారసు చేసింది. చంద్రబాబు ఆమోదముద్ర వేశారు. ఇకపై మండలాన్ని కూడా వాసవీ పెనుగొండ మండలంగా పిలవనున్నారు. పెనుగొండ వాసవీమాత ఆలయాన్ని స్థానికులు నిత్యం సందర్శిస్తారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలోనే వాసవీమాత ఆలయాన్ని నిర్వహిస్తున్నారు. వాసవీధామ్‌ను ప్రత్యేకంగా ఆర్యవైశ్య సమాజం నిర్మించింది. అక్కడ కూడా అమ్మవారికి పంచలోహ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. నిత్యం ఇతర రాష్ట్రాల నుంచి విచ్చేసి వాసవీమాతను కొలుస్తుంటారు. పర్యాటక కేంద్రంగానే వాసవీ పెనుగొండను తీర్చిదిద్దేలా ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. పేరు మార్పు నిర్ణయంపై ఆర్యవైశ్యులే కాకుండా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికి లేనట్లే..

- యథాతథంగా ఏలూరు జిల్లా
- నూజివీడు, కైకలూరు ఇక్కడే
- స్థానికుల ఆశలు గల్లంతు

ఏలూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి):జిల్లా పునర్విభజనలో నియోజకవర్గాల మార్పులు, చేర్పుల విషయంపై ప్రభుత్వం ఊరించి.. ఉసూరమనిపించింది. కొద్ది నెలల క్రితం నుంచి కసరత్తు చేయడంతో పాటు ప్రజలు, వివిధ వర్గాల అభిప్రాయాలు సేకరించారు. మంత్రివర్గ ఉపసంఘంలోను చర్చలు సాగాయి. చివరికి నూజివీడు నియోజకవర్గం ఎన్టీఆర్ జిల్లాలోకి, కైకలూరు నియోజకవర్గాన్ని కృష్ణా జిల్లాలోకి చేర్చడం లేదని తేల్చేశారు. ప్రభుత్వం నియమించిన ఉప సంఘంలో చర్చించి ఆశలు కల్పించి తీరా మంగళవారం ఏమీ లేదని తేల్చేశారు. ఈ రెండు నియోజకవర్గాల విభజన వలన మూడు జిల్లాల్లో అంటే ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలో కొత్త సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్న కోణంలో విరమించుకున్నట్లు తెలుస్తోంది. రెండు నియోజక వర్గాల ప్రజలు, మేధావుల్లో కొంత నిరాశకు గురి చేసింది. కృష్ణా జిల్లా విభజన అంశం తానే చూసుకుంటానని సీఎం చంద్రబాబు అనడంతో పునర్విభజన అంశం ప్రస్తుతానికి లేనట్లేనని అంతా భావిస్తున్నారు. జిల్లాల పునర్విభజనపై మంత్రి వర్గ సంఘం సమావేశాల్లో తొమ్మిది జిల్లాల్లో ఏ విధమైన మార్పులు చేయబోవడం లేదని ప్రకటించారు. అయితే రెవెన్యూ డివిజన్‌లలో మార్పులపై ఏ విధమైన చర్యలు తీసుకున్నారో స్పష్టత రావాల్సి వుంది.

కొల్లేరులో వరి సాగుకు రైతుల యత్నం 7

బుట్టాయగూడెం ఎంపీపీపై అవిశ్వాసం

- వైసీపీ సభ్యుల నిర్ణయం
- నేడు ప్రత్యేక సమావేశం

బుట్టాయగూడెం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి):బుట్టాయగూడెం వైసీపీ ఎంపీపీ కారం శాంతిపై సొంత పార్టీ నేతలే అవిశ్వాసం ప్రకటించారు. సభ్యుల నిర్ణయంతో ఆర్డీవో ఎం వి.రమణ బుధవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మండలంలో 15 మంది ఎంపీటీసీ సభ్యులు ఉండగా ఇద్దరు సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, ఒకరు టీడీపీకి చెందిన సభ్యులు ఉన్నారు. మిగిలిన 12 మంది వైసీపీ సభ్యులే. సభ్యుల నిర్ణయంతో ఎంపీపీ శాంతి పదవి పోవడం ఖాయమని నేతలు విశ్లేషిస్తున్నారు. తదుపరి ఎంపీపీ ఎవరనే అంశంపై ఉత్కంఠ నెలకొంది. ఎంపీపీ పీఠంపై పలువురు సభ్యులు ఆశ పడుతున్నట్లు సమాచారం. ప్రభుత్వం మారిన వెంటనే ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం పెట్టి పదవి నుంచి దించివేయాలని వైసీపీ వారు భావించినా నాలుగేళ్లు పూర్తికాకుండా అవిశ్వాస తీర్మానం పెట్టడానికి అవకాశం లేకపోవడంతో ఇప్పటికి అవకాశం వచ్చింది.

ఎంపీపీ భర్త తీరుపై విగిసిపోయి..

వైసీపీకి చెందిన ఎంపీపీ శాంతిపై సొంత పార్టీ సభ్యులే అవిశ్వాసం ప్రకటించడానికి ప్రధాన కారణం ఆమె భర్తే అనే వాదన వినిపిస్తోంది. పేరుకు మాత్రమే ఆమె ఎంపీపీ అని.. ఆమె భర్తే పెత్తనం చేస్తుంటారని సభ్యులు గుర్రుగా ఉన్నారు. ఎంపీటీసీ అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా తాను అనుకున్నదే చేస్తుంటాడని, అభివృద్ధి పనుల వివరాలను చెప్పకుండా ఒక్కడే నిర్ణయాలు చేస్తుంటాడని, పద్ధతి మార్చుకోవాలని చెప్పినా వినకపోవడంతో అవిశ్వాస తీర్మానం పెట్టడానికి సిద్ధపడినట్లు కొందరు వైసీపీ ఎంపీటీసీలు చెబుతున్నారు. ఈ నెల 13న అధికారులకు అవిశ్వాసం నోటీసు అందజేశారు. మొత్తం 15 మందిలో 12 మంది వైసీపీ ఎంపీటీసీ సభ్యులే. ఎంపీపీ కాకుండా మిగిలిన 11 మందిలో ఆరుగురు మహిళలు, ఐదుగురు పురుషులు. మహిళకు రిజర్వు కావడంతో బుట్టాయగూడెం, సీతప్ప గూడెం, రెడ్డిగణవరం, లక్ష్మడుగూడెం ఎంపీటీసీలు ఎంపీపీ పదవి ఆశిస్తున్నట్లు సమాచారం. సంఖ్యాబలం లేకపోవడంతో ఇతర పార్టీలు ఎంపీపీ పదవిపై ఆశ పెట్టుకున్నట్లు లేదు. ప్రస్తుతానికి అవిశ్వాసం తీర్మానంపై చర్చ మాత్రమే జరుగుతుండగా ఎంపీపీ పదవికి ఎన్నిక జరగడానికి సమయం ఉన్నందున ఎటువంటి మార్పులు చేర్పులు జరుగుతాయో వేచిచూడాలి.

నేడు డీఆర్సీ సమావేశం

ఏలూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి):జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ ఆధ్వర్యంలో ఈనెల 26 ఉదయం 11 గంటలకు జిల్లా సమీక్షా కమిటీ సమావేశం (డీఆర్సీ) కలెక్టరేట్‌లో జరగనుంది. ఈ మేరకు కలెక్టర్ వెట్రిసెల్వి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో గృహ నిర్మాణం, ధాన్యం కొనుగోలు, 22ఏ కేసుల పరిష్కారం, తదితర అంశాలపై మంత్రి నాదెండ్ల అధికారులతో పాటు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సమీక్షిస్తారు.

నేడు సీఆర్పీలకు శిక్షణ

ఏలూరు అర్బన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు నియమించిన క్లస్టర్ రిసోర్స్ పర్సన్ల(సీఆర్పీ)కు ఏలూరు సుబ్బమ్మదేవి మున్సిపల్ హైస్కూలులో బుధవారం ఆడిట్ బృందాల శిక్షణ ఇవ్వనున్నట్లు సమగ్రశిక్ష జిల్లా సీఎంవో డి.యెహోషువ తెలిపారు. జిల్లాలోని మండల పరిషత్, జడ్పీ, ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు, భవిష్యత్ అవసరాలకు కల్పించాల్సిన సౌకర్యాలు పరిశీలించాలి. తరగతి గదులు, టాయిలెట్లు, క్రీడామైదానాలు, తదితర విషయాలపై సీఆర్పీల ఆధ్వర్యంలోని 100 ఆడిట్ బృందాలు స్కూళ్లను సందర్శించి డిసెంబరు 10 లోపు నివేదికలు అందజేయాల్సి ఉంటుందని యెహోషువ తెలిపారు.

ఇంజనీర్లు లేరు

జలవనరుల శాఖలో కొరవడిన పర్యవేక్షణ



- 29 మందికి ఉన్నది 8 మంది మాత్రమే
- మైనర్, మేజర్ ప్రాజెక్టుల్లో ఇక్కట్లు
- అక్రమార్కుల మట్టి, ఇసుక దందా

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

జల వనరుల శాఖలో ఇంజనీర్ల కొరత వేధిస్తోంది. ఏళ్ల తరబడి ఖాళీలు భర్తీ కాకపోవడంలో కీలకమైన మైనర్, మేజర్ ప్రాజెక్టుల పర్యవేక్షణ కష్టతరంగా మారింది. వరదలు, తుఫాన్ సమయంలో అధికారులు నానా తంటాలు పడుతున్నారు. చెరువులు, సమీపంలో కాల్వ పరిసరాల్లో మట్టి, ఇసుక అక్రమ తవ్వకాలను అడ్డుకోలేకపోతున్నారు. జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పొరుగు జిల్లాలోనే ఉన్న ఇంజనీర్ల కొరతకు చెక్ పడడం లేదు. సాగు, తాగునీరుతోపాటు పశువులకు నీరందించే జలవనరుల శాఖలో ఇంజనీర్ల కొరత తీవ్రంగా ఉంది. జిల్లాల విభజన జరిగిన తర్వాత, అంతముందు నుంచి ఏ ఒక్క ఖాళీ భర్తీ చేయలేదు. కోట రామచంద్రాపురంలోని మైనర్ ఇరిగేషన్ డివిజన్‌లో 14 మంది అసిస్టెంట్ ఇంజనీర్లు పనిచేయాల్సి ఉండగా కేవలం నలుగురు ఉన్నారు. ప్రధానంగా జల్లేరు రిజర్వాయర్ కింద 4200 ఎకరాలు, పోగొండ రిజర్వాయర్ కింద 7,650 ఎకరాలకు, బైనేరు వాగుకింద స్వల్పంగా సాగునీటి సరఫరా జరుగుతుంది. నలుగురు ఇంజనీర్లతో పర్యవేక్షణ సాధ్యంకాదు. అరకొరగా ఉన్న లస్కర్లపైనే ఆధార పడుతున్నారు. ప్రధానంగా ఈ మూడు ప్రాజెక్టుల కింద వేల ఎకరాల భూమిలో వివిధ పంటలు సాగవుతుంటాయి. మీడియం ఇరిగేషన్ ఏలూరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం పరిధిలో తమ్మిలేరు రిజర్వాయర్‌లో 32వేల ఎకరాలు ఎర్రకాల్వ కింద 24,700 ఎకరాలు, కొవ్వాడలంక 8వేలు ఎకరాల పంటలకు సాగు నీరు అందుతుంది. ఇక్కడ మూడు ప్రాజెక్టుల కింద మొత్తం 15 మంది ఇంజనీర్లు పనిచేయాల్సి ఉంది. కేవలం నలుగురే ఏఈలు ఉన్నారు. ప్రాజెక్టుల పరిధిలో షట్టర్లు, లాకుల మరమ్మతుల ప్రతిపాదనలు సకాలంలో పంపలేకపోతున్నారు. పలుచోట్ల లీకేజీలతో ప్రాజెక్టుల వద్ద నీటివృథా జరుగుతోంది.

మట్టి, ఇసుక అక్రమాలు

నదులు, వాగులు, రిజర్వాయర్ల పరిసరాల్లో ఇసుక అక్రమంగా తవ్వేస్తున్నారు. ఏఈల కొరత వలనే సహజ సంపద అక్రమార్కుల పాలవుతోంది. జల వనరుల శాఖ ఇంజనీర్లు రెవెన్యూ, పోలీస్ అధికారులతో మాట్లాడి అడ్డుకోవాల్సి ఉంది. అవసరమైతే కేసులు పెట్టించాల్సి ఉంది. పర్యవేక్షణ కొరవడడంతో చెరువుల్లో సైతం మట్టి తవ్వకాలు యథేచ్ఛగా సాగిపోతున్నాయి. తమ్మిలేరులో అక్రమార్కులు ఇసుక, మట్టి అక్రమ తవ్వకాలతో భారీగా కూడబెట్టుకుంటున్నారని ఆరోపణలు వస్తున్నాయి.

చెరువుల అభివృద్ధి కష్టమే..

ఏలూరు జిల్లాలో 1,513 ఇరిగేషన్ చెరువులు ఉన్నాయి. వీటి అభివృద్ధికి ట్రిపుల్ ఆర్ పథకంలో జిల్లా యంత్రాంగం సకాలంలో ప్రతిపాదనలు పంపడంలో విఫలమవుతోంది. ఏఈల కొరత కారణంగా జాప్యంతో అభివృద్ధికి ఆటంకం ఏర్పడుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకంలో చెరువుల మరమ్మతులు, అభివృద్ధి, పునరుద్ధరణకు ఇటీవలే నడుంబిగించింది. ఇప్పటికే 18 నెలలు గడిచిపోయాయి. కీలకమైన ఇంజనీర్ల కొరత వలనే ఈ నిధులు సకాలంలో జిల్లాకు వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు వరదల వలన ఏ చెరువుకు ఎప్పుడు గండి పడుతుందో అర్థం కాని అయోమయస్థితి నెలకొంది. ఇటీవల మొంథా తుఫాన్‌లో చెరువుల వద్ద జల వనరుల శాఖ అధికారులు పోలీస్ శాఖతోనే రక్షణ చర్యలు, పర్యవేక్షణ చేపట్టారు.





చింతలపూడిలో వాహన డ్రైవర్‌కు ఫేస్ వాష్

జిల్లాలో వాహనాల తనిఖీ

ఏలూరు క్రైం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పోలీసులు సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు వాహనాలు తనిఖీ చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం డ్రైవర్లకు నిద్రమత్తు లేకుండా వారి ముఖం కడిగించారు. అతి వేగంతో వాహనాలు నడుపకూడదని, ద్విచక్ర వాహన దారులు హెల్మెట్ ధరించాలని, కారులో సీటు బెల్టు పెట్టుకోవాలన్నారు. వాహనాల రికార్డులను పరిశీలించారు. వాహన భద్రతా నియామాలను పాటించాలని సూచించారు.

రూ. 1,119 కోట్ల పొగాకు కొనుగోలు

- ఈ నెల 27, 29తో ముగియనున్న విక్రయాలు
- ఈ ఏడాది రికార్డు స్థాయిలో ధరలు నమోదు

జంగారెడ్డిగూడెం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి):వర్జీనియా పొగాకు కొనుగోళ్లు ముగింపు దశకు చేరుకున్నాయి. ఎన్ఎల్ఎస్ పరిధిలోని దేవరపల్లి, గోపాలపురం, కొయ్యలగూడెం పొగాకు వేలం కేంద్రాలలో కొనుగోళ్లు పూర్తయ్యాయి. జంగా రెడ్డిగూడెం వేలం కేంద్రం-18లో ఈ నెల 27, వేలం కేంద్రం-32లో ఈ నెల 29న కొనుగోళ్లు పూర్తయ్యే అవకాశం ఉన్నట్లు వేలం నిర్వహణాధికారులు బి.శ్రీహరి, జె.సురేంద్ర తెలిపారు.

జంగారెడ్డిగూడెంలో రెండు పొగాకు వేలం కేంద్రాల్లో రూ.1,119 కోట్ల పొగాకును కొనుగోలు చేశారు. వేలం కేంద్రం-18లో మంగళవారం నాటికి రైతులు రూ.553 కోట్ల విలువైన పొగాకు విక్రయించారు. 18.46 మిలియన్ కిలోల పొగాకును వివిధ కంపెనీలు కొనుగోలు చేశాయి. గత ఏడాది కిలో వర్జీనియా పొగాకు రూ.411 ధర ఆల్‌టైమ్ రికార్డు కాగా ఈ ఏడాది రూ.456 ధర రికార్డును బ్రేక్ చేసింది. అత్యల్ప ధర రూ.50 కాగా సరాసరి ధర రూ.299.84. వేలం కేంద్రం-32 లో రూ.566 కోట్ల విలువైన 18.80 మిలియన్ కిలోల పొగాకును కంపెనీలు కొనుగోలు చేశాయి. ఇక్కడ గత ఏడాది రూ.411 అధిక ధర రాగా ఈ సంవత్సరం రూ.456 అధిక ధర వచ్చింది. అత్యల్ప ధర రూ.49 కాగా సరాసరి ధర రూ.301.44 దక్కింది.

మహిళలపై వేధింపుల నిరోధానికి కృషి



మాట్లాడుతున్న జడ్జి రత్నప్రసాద్

ఏలూరు రూరల్, నవంబరు 25, (ఆంధ్రజ్యోతి): సమాజంలో మహిళలపై వేధింపులు నిరోధించడానికి కలిసికట్టుగా కృషి చేద్దామని ఉమ్మడి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ పిలుపునిచ్చారు. మంగళవారం అంతర్జాతీయ మహిళా వేధింపుల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఏలూరు మండల పరిషత్ సమావేశ మందిరంలో జిల్లాలోని సంబంధిత అధికారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ నేటి ఆధునిక సమాజంలో విద్యాపరంగా ఎంతో అభివృద్ధి చెందినప్పటికీ మహిళలపై వేధింపులు తరచుగా జరుగుతున్నాయని, చైతన్యవంతం చేస్తూ, నిరోధించడానికి చట్టాలను మరింత కఠినంగా అమలు చేస్తామని అన్నారు. నేటి సమాజంలో మహిళలు ఆన్‌లైన్ వేధింపులకు గురవుతున్నారని, చరవాణిలను ఉపయోగించేటప్పుడు మహిళలు జాగ్రత్తలు తీసుకోవాలని, అనుమానితులు, అపరచితుల నుంచి ఫోను వస్తే స్పందించవద్దని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 15100 ద్వారా ఉచిత సలహాలు పొందవచ్చని సూచించారు. ఈకార్యక్రమంలో ఉమెన్ డెవలప్‌మెట్ మరియు చైల్డ్ వెల్ఫేర్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.శారద, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ డా.సీహెచ్ సూర్యచక్రవేణి, ఏలూరు తహసీల్దార్ యస్ గాయత్రిదేవి, డిప్యూటీ ఎడ్యుకేషనల్ అధికారి ఎస్.రవీంద్ర భారతి పాల్గొన్నారు.


బాలుర ఉన్నత పాఠశాలలో ప్రసంగిస్తున్న డీవీవీఎస్ వర్మ

రాజ్యాంగ పీఠిక-ప్రతిజ్ఞకు విశేష స్పందన

తణుకు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి):రాజ్యాంగం గురించి పాఠశాల స్థాయిలో ఉన్న ప్రతి విద్యార్థి తెలుసుకోవాల్సిన అవసరం ఉందనే ఉద్దేశంతో చేసిన ప్రయత్నానికి విశేష స్పందన లభించింది. కొన్ని నెలలుగా రాజ్యాంగ పీఠిక-ప్రతిజ్ఞను పెద్ద ఎత్తున ప్రజలు, సంస్థలు చేపట్టాలని జిల్లా రాజ్యాంగ ప్రచార వేదిక కన్వీనర్ డీవీవీఎస్ వర్మ చేసిన ప్రయత్నాలు సత్ఫలితాలను ఇచ్చింది. మంగళవారం పలు విద్యాసంస్థల్లో విద్యార్థులచే ఆయా యాజమాన్యాలు పీఠిక పఠనం-పీఠిక ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. తణుకులోని మాంటిస్సోరి స్కూలు, ఇండియన్ పబ్లిక్‌స్కూల్, రూట్స్ స్కూలు, భాష్యం స్కూలు, ఎస్ఎఫ్ఎస్ స్కూలు, జిల్లా పరిషత్ బాలురున్నత పాఠశాలల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రచార వేదిక కన్వీనర్ వర్మ మాట్లాడుతూ 2026 జనవరి 26 రిపబ్లిక్ దినోత్సవం వరకు ప్రచారం కొనసాగించాలని విద్యాసంస్థలకు విజ్ఞప్తి చేశారు. పీఠికలోని పదాలను వివరించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఆయా పాఠశాలల్లో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, యాజమాన్యాల ప్రతినిధులు పాల్గొన్నారు.

టీటీలో సెయింట్ థెరిస్సాకు ద్వితీయ స్థానం


నన్నయ యూనివర్సిటీ అధికారుల నుంచి కప్‌ను అందుకుంటున్న సెయింట్ థెరిస్సా విద్యార్థులు

ఏలూరు అర్బన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి):పెనుగొండ ఎస్వీకేపి అండ్ డాక్టర్ కెఎస్ రాజు ఆర్ట్స్, సైన్స్ కళా శాలలో మంగళవారం జరిగిన అంతర్ కళాశాలల టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ కం యూనివర్సిటీ సెలక్షన్స్ పోటీల్లో స్థానిక సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల డిగ్రీ విద్యార్థినుల బృందం ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ బృందంలో అద్భుతమైన క్రీడానైపుణ్యాన్ని కనబరిచిన జ్ఞానీ జైన్ డిసెంబరు 9నుంచి 12వ తేదీ వరకు విశాఖపట్నంలోని గీతం యూనివర్సిటీలో నిర్వహించనున్న దక్షిణ మండలం (సౌత్‌జోన్) విశ్వవిద్యాలయాల టోర్నమెంట్‌లో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తరపున పాల్గొనే జట్టులో ప్రాతినిధ్యం వహించడానికి ఎంపికైందని కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ తెలిపారు. ద్వితీయ స్థానంలో నిలిచిన విజేతల బృందాన్ని వైస్‌ప్రిన్సిపాల్ సిస్టర్ సునీలారాణి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ సిస్టర్ సుశీల, అధ్యాపకులు అభినందించారు.

అంతర్ విశ్వ విద్యాలయాల పోటీలకు ఎస్వీకేపీ విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు

పెనుగొండ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): సౌత్‌జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల టేబుల్ టెన్నిస్ పోటీలలో పాల్గొనే ఆదికవి నన్నయ యూనివర్శిటీ టీమ్‌కు పెనుగొండ ఎస్వీకేపీ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారు. మహిళ విభాగంలో జి. రేణుక, పురుషులలో కె. సురేంద్ర అర్హత సాధించారు. అలాగే అంతర్ కళాశాలల పోటీల్లో కూడా ఈ కళాశాల విద్యార్థులు పతకాలు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ప్రసన్న, కళాశాల పాలకవర్గ అధ్యక్షులు తాడి నాగిరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ బి. బాపిరెడ్డి, కళాశాల జాయింట్ సెక్రటరీ సుబ్రహ్మణ్య రాజు తదితరులు అభినందించారు.

అథ్లెట్ పవన్‌కు పతకాలు



ద్వారకాతిరుమల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం వేడుకల్లో మండలంలోని పంగిడిగూడెంకు చెందిన యువ అథ్లెట్ కస్సే పవన్‌కుమార్ తన ప్రతిభ చూపాడు. గతంలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో జరిగిన పోటీల్లో ప్రతిభచూపిన పవన్ మరోసారి తన సత్తాను చాటాడు. మంగళవారం ఏలూరులోని ఏఎస్ఆర్ స్టేడియంలో సీనియర్ విభాగంలో జరిగిన 100మీటర్ల పరుగులో స్వర్ణం, షాట్‌పుట్‌లో స్వర్ణం సాధించినట్లు పవన్ తెలిపాడు.



పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

అత్తిలి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : అత్తిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1975-76 సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల 50 సంవత్సరాల ఆత్మీయ సమ్మేళనం అత్తిలి లయన్స్‌క్లబ్‌లో జరిగింది. తాము చదువుకున్న రోజుల్లో చేసిన అల్లర్లను, ఆటపాటలను ముచ్చటించుకున్నారు. తమకు విద్యా బుద్దులు నేర్పిన ఉపాధ్యాయులను గుర్తు తెచ్చుకున్నారు. హైదరాబాద్, బెంగళూరు తదితర ప్రాంతాల నుంచి వచ్చిన పూర్వ విద్యార్థులు ఆత్మీయంగా పలకరించుకుని వారి స్థితిగతులను తెలుసుకున్నారు. ఇటీవల మృతి చెందిన ఐదుగురు పూర్వ విద్యార్థులకు శ్రద్ధాంజలి ఘటించారు. పూర్వ విద్యార్థులు కుడిపూడి ప్రభాకరరావు, చొప్పా వెంకటేశ్వరరావు, పొన్నాడ రామచంద్రరావు, అత్తిలికి చెందిన బండి భాస్కరరావు, బండి మల్లేశ్వరరావు, గుత్తికొండ సత్యనారాయణ, తిప్పా కోటేశ్వరరావు, వైట్ల కనకదుర్గ ప్రసాద్, పి.రామచంద్రరావు ఆధ్వర్యంలో జరిగింది.

సరిలేరు.. మాకెవ్వరూ..

ఉత్సాహంగా దివ్యాంగుల క్రీడా పోటీలు


రన్నింగ్ పోటీలు


దివ్యాంగుల పరుగు పందెం



ఏలూరు రూరల్, నవంబరు 25, (ఆంధ్రజ్యోతి) : గెలిచే వరకు అలుపు లేదు. గెలుపే మనందరికీ స్ఫూర్తి. ఆ స్ఫూర్తితో దివ్యాంగులు జీవితంలో ముందుకు సాగుతూ వైకల్యాన్ని అధిగమించి ఆత్మవిశ్వాసంతో క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. దివ్యాంగులైతేనేం దేనిలోనూ తగ్గేది లేదని నిరూపించారు. వైకల్యాన్ని అధిగమించి ఉరుకులు పరుగులు పెట్టారు. కంటిచూపు లేకపోయినా విజయలక్ష్యాన్ని నిర్దేశించుకుని తేలిగ్గా చేరుకున్నారు. షాట్‌బాల్‌లో బాలును గురి చూసి విసిరి విజేతలుగా నిలిచారు. అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా విభిన్న ప్రతిభావంతులు వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో దివ్యాంగులకు క్రీడా పోటీలు నిర్వహించారు. దివ్యాంగులు ఉత్సాహంగా పాల్గొని తమలోని ప్రతిభను చూపించారు. క్రీడా పోటీల్లో క్రీడాస్ఫూర్తి, పోటీతత్వం వెల్లివెరిశాయి. ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అంగవైకల్యం ప్రతిభకు అడ్డుకాదన్నారు. దివ్యాంగులను అన్ని రంగాల్లో ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లావ్యాప్తంగా సుమారు 500 మంది దివ్యాంగ క్రీడాకారులు హాజరయ్యారు. విజేతలకు డిసెంబరు 3వ తేదీన ఏలూరులో జరిగే కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పతకాలు అందజేస్తారు. ఈకార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మామిళ్ళపల్లి పార్థసారథి, యూడా చైర్మన్, డీఎస్‌డీవోఎస్ఏ అజీజ్, విభిన్న ప్రతిభావంతులశాఖ ఏడీ బి రామ్‌కుమార్, యుగంధర్, పీఈటీలు పాల్గొన్నారు.


సహాయకులతో రన్నింగ్ చేస్తున్న అంధులు


షాట్‌పుట్

కల్యాణ వైభోగమే

ఘనంగా వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం

తాడేపల్లిగూడెం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి):తాడేపల్లిగూడెంలోని పాతూరులో శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం మంగళవారం రాత్రి 7.45 గంటలకు ఉత్తరాషాఢ నక్షత్రయుక్త ధనస్సు లగ్నంలో అంగరంగా వైభవంగా నిర్వహించారు. మంగిన శివాజీరావు, నాగలక్ష్మినర్సమాంబ దంపతులతే ప్రధానార్చకులు జోశ్యుల శ్రీరామచంద్రమూర్తిశర్మ బ్రహ్మత్వంలో కల్యాణం జరిగింది. బుధవారం తెల్లవారు జామున 3గంటల నుంచి స్వామివారి దర్శనానికి అనుమతి ఇచ్చారు. ఆలయాన్ని విద్యుత్ కాంతులతో అలంకరించారు. ఆలయ ప్రాంగణాన్ని పరిశుభ్రం చేశారు. భక్తుల దర్శనం కోసం బారికేడ్లు ఏర్పాటు చేశారు. షష్టిరోజు సాయంత్రం స్వామి వారికి పల్లకి ఉత్సవం నిర్వహిస్తారు. 27వ తేదిన శిఖామణి భగవతారిణిచే పార్వతీకల్యాణం హరికథ, 28న శ్రీ లక్ష్మీనరసింహస్వామి సత్సంగం సభ్యులచే శ్రీవెంకటేశ్వర గానామృత కల్యాణం నిర్వహించనున్నారు.

షష్టి తిరునాళ్లు

షష్టి మహోత్సవాల్లో భాగంగా ఏలూరు కాలువ వెంబడి శివాలయం ఎదుట షష్టి ఉత్సవాల ఏర్పాట్లు చేశారు. ఆరురోజుల పాటు పెద్ద ఎత్తున ఉత్సవాలు జరుగుతాయి. జైంట్‌వీల్, రంగుల రాట్నాలు, కొలంబస్ వంటివి ఏర్పాటు చేశారు. ఇవికాక వివిధ రకాల వస్తువులతో కూడి స్టాల్స్ ఏర్పాటు చేశారు. తినుబండారాలకు ప్రత్యేంగా ఒక ప్రాంతాన్ని ఎంపిక చేశారు.

పెంటపాడు: పడమరవిప్పర్రు వల్లీదేవసేన సమేత సంతాన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి ఘనంగా స్వామి వారి కల్యాణాన్ని నిర్వహించారు. ఏర్పాట్లు పర్యవేక్షించిన మాజీ సర్పంచ్ పసల చంటి మాట్లాడుతూ బుధవారం ఆలయ ప్రాంగణం వద్ద ఘనంగా షష్టి ఉత్సవాలు జరుగుతాయన్నారు. అనంతరం జరిగే తెప్పోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. పెంటపాడు పార్వతీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఘనంగా స్వామి వారి కల్యాణాన్ని నిర్వహించారు. ఏర్పాట్లను ఆల య కమిటి అధ్యక్షుడు కొవ్వూరి లక్ష్మణరెడ్డి , సభ్యులు పర్యవేక్షించారు.

ఆకివీడు: సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం మంగళవారం రాత్రి అంగరంగ వైభంగా జరిగింది. నేరెళ్ళ శ్రీవైష్ణవ్, డింపు మణిదీపిక, మోటుపల్లి హేమంత్‌బాబు, ఆశ రత్నదీపికలతో పాటు మరో పద్నాల్గు దంపతులు పీటలపై కూర్చున్నారు. షష్టి ప్రాంగణంలో వ్యాపారస్తులు దుకాణాలు ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు మోటుపల్లి రామవర ప్రసాద్, ఏఎంసీ చైర్మన్ బొల్లా వెంకట్రావు, బీజేపీ మండలాధ్యక్షురాలు ఎంవీఎస్ నాగ మణి తదితరులు పాల్గొన్నారు.


పడమరవిప్పర్రులో స్వామివారి కల్యాణోత్సవాలు

నిడమర్రు: కైకరంలో మంగళవారం రాత్రి స్వయంభూగా వెలసిన నాగమ్మ అమ్మవారి సన్నిధిలో శ్రీవల్లీ దేవసేన సహిత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణ మహోత్సవాలు వైభవంగా నిర్వహించబడ్డాయి. కళ్యాణ మహోత్సవాల అనంతరం స్వామి వారి దర్శనాలను ఏర్పాట్లు చేశారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో అఖండ అన్నసమారాధన ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

అత్తిలిలో భారీగా భక్త జన సందోహం



అత్తిలిలో కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు... స్వామివారి కల్యాణం చేస్తున్న పండితులు

అత్తిలి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అత్తిలిలో వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యా ణం అత్యంత వైభవంగా నిర్వహించారు. అత్తిలికి చెందిన ఏఎంసీ చైర్మన్ దానం ప్రసాద్, రాజరాజేశ్వరి దంపతులు స్వామివారి కల్యాణాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు ఐలూరి రామం, కృష్ణ ఆధ్వర్యంలో కల్యాణోత్సవాన్ని ఘనంగా జరిపారు. కల్యాణాన్ని తిలకించడానికి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. అంతకుముందు కల్యాణం నిర్వహించే ప్రసాద్ దంపతులు మేళతాళాలతో గ్రామంలో ఊరేగుతూ కల్యాణ వేదికకు వచ్చారు. కల్యాణం అనంతరం స్వామి వారికి సమర్పించే తలంబ్రాలు కోసం పెద్ద సంఖ్యలో మహిళలు ఎగబడ్డారు. ఈ తలంబ్రాలు వండుకుంటే సంతానం లేని వారికి సంతానం, పెళ్ళికాని వారికి పెళ్ళి అవుతుందని నమ్ముతారు. స్వామి వారి షష్టి తిరునాళ్ల సందర్భంగా ఇరువురు సీఐలు, నలుగురు ఎస్ఐలు, 100 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. షష్టి పందిరిలో 16 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.


ద్వారకాతిరుమల నుంచి సింహాచలంకు పయనమైన మాజీ జడ్పీటీసీ లక్ష్మీరమణి, తదితరులు

పాదయాత్రగా సింహాచలం అప్పన్న దర్శనానికి..

చంద్రబాబు సీఎం కావాలన్న మొక్కును తీర్చుకుంటున్న మాజీ జడ్పీటీసీ

ద్వారకాతిరుమల, నవంబరు 25(ఆంధ్రజ్యోతి):చంద్రబాబు ముఖ్యమంత్రి కావడంతో సింహాచలం శ్రీవరాహలక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి తన మొక్కును తీర్చుకునేందుకు మాజీ జడ్పీటీసీ మొగత డకల లక్ష్మీ రమణి పాదయాత్రగా మంగళవారం తరలివెళ్లారు. ముందుగా ఆమె తన ఇంట్లో మహిళలతో విష్ణు, లలితా సహస్రనామాలను పఠించారు. అనంతరం ద్వారకాతిరుమల ఆలయ తొలిమెట్టు వద్ద తన భర్త టీడీపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు మొగతడకల శ్రీనివాసరావుతో కలసి కొబ్బరికాయలు కొట్టి స్వామివారి పాదుకలకు పూజలు చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. దాదాపు 300కిమీ మేర కాలినడకన వెళ్లి సింహాచలం అప్పన్నను దర్శించుకోనున్నట్లు చెప్పారు. ఆమెతో కుమార్తు సంజీవ్‌చౌదరి, టీడీపీ నేత నాగమణి, నాగకల్యాణి, తదితరులు పాదయాత్రగా వెళ్లారు.

ఆచంటలో మినీ బైపాస్ రోడ్డుకు మోక్షం


రోడ్డు పనులు పరిశీలిస్తున్న పంచాయతీ రాజ్ డీఈ కృష్ణమూర్తి, తదితరులు

ఆచంట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి):ఆచంట పోలీసు స్టేషన్ నుంచి సంతమార్కెట్‌కు వెళ్ళే రహదారికి సంబంధించి ఇటీవల కొత్తగా మినీ బైపాస్ రోడ్డును ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వంలో ఈ రోడ్డును ఏర్పాటు చేయగా ఇటీవల ఈ రోడ్డు పెద్దపెద్ద గోతులు పడటంతో అధ్వానంగా మారింది. ఈ రోడ్డును పరిశీలించిన ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ వెంటనే మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. దీనిలో భాగంగా ఈ రోడ్డుకు సంబంధించి గతంలో వేసిన మట్టిని తొలగించి సుమారు 15 లక్షలతో గ్రావెల్ డస్ట్‌తో కూడిన రోడ్డు వేసేందుకు పనులు ప్రారంభించారు. ఈ పనులను పంచాయతీ రాజ్ డీఈ కృష్ణమూర్తి ఏఈ ఏడుకొండలు పరిశీలించారు. ఈ రోడ్డు వేసిన అనంతరం ఈ రోడ్డును ఆర్‌అండ్‌బీ రోడ్డు బదలాయించి త్వరలో రూ. 90 లక్షల నిధులతో సీసీ రోడ్డు కూడా నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


వాలీబాల్ ఆడుతున్న వీసీ రమణ

విద్యతోపాటు క్రీడలకు ప్రాధాన్యత

వెటర్నరీ విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ రమణ

తాడేపల్లిగూడెం రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి):వెటర్నరీ విద్యర్థులకు విద్యతోపాటు, క్రీడలకు ప్రాధాన్యత ఇస్తున్నామని ఇది విద్యార్థుల ప్రతిభా వికాసానికి దోహదపడుతుందని శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జేవి రమణ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెం డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయ క్రీడా ప్రాంగణంలో మంగళవారం ఇంటర్ వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాలల క్రీడలు, సాంస్కృతిక, సాహిత్య పోటీలను ఆయన ప్రారంభించారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ పోటీలకు రాష్ట్రం నలుమూలల నుంచి పది కళాశాలల నుంచి 270 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైస్ చాన్స్‌లర్ రమణ మాట్లాడుతూ పాలిటెక్నిక్ విద్య అనేది క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహించాల్సిన అవసరం ఉందని అందుకు విద్యార్థులకు క్రీడల ద్వారా మంచి ఆరోగ్యం, క్షేత్ర స్థాయిలో రైతులతో మమేకం అయ్యే అవకాశం ఉందన్నారు. యూనివర్శిటి డిన్ ఎ.వైకుంఠరావు మాట్లాడుతూ క్రీడలు క్రమశిక్షణ పట్టుదలను పెంచుతాయన్నారు. పోటీ తత్వం అలవర్చుకోవాలన్నారు. అనంతరం నిర్వహించిన క్రీడా పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన విస్తరణ విభాగాధిపతి గోవిందరాజులు, వర్శిటీ అబ్జర్వర్, రీసెర్చ్ విభాగాధిపతి కె.ఆనందరావు, డీన్ ఆఫ్ స్టూడెంట్స్ సుర్యకుమారి, వెటర్నరిపాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ వి సమత సిబ్బంది పాల్గొన్నారు.

టీటీలో ఎస్‌కేఎస్‌డీ విద్యార్థినుల ప్రతిభ


విద్యార్థినులను అభినందిస్తున్న సత్య ఉషారాణి

తణుకు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ్య యూనివర్శిటీ టేబుల్ టెన్నీస్ ఇంటర్ కాలేజియేట్ కమ్ యూనివర్శిటీ ఎంపికలో ఎస్‌కేఎస్‌డీ విద్యార్థినులు ప్రథమ స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ యు. లక్ష్మీసుందరీబాయి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ ఈనెల 22న పెనుగొండలో ఎస్వీకేపీ అండ్ డా. కెఎస్ రాజు ఆర్ట్స్, సైన్సు డిగ్రీ కాలేజిలో జరిగిన పోటీలలో తమ విద్యార్థినులు పి. బిందు స్రవంతి, జి. అశ్విని భవాని, టి. వినయదుర్గ, బి.శిరీష, డి.చంద్రలేఖలు ప్రథమ స్థానంలో నిలిచారని చెప్పారు. ఈసందర్భంగా కళాశాల కార్యదర్శి చిట్టూరి సత్య ఉషారాణి విద్యార్థినులను అభినందించారు.

మద్ది ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



జంగారెడ్డిగూడెం రూరల్, నవంబరు 25, (ఆంధ్రజ్యోతి): గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయస్వామిని మంగళవారం సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. స్వామి వారికి అత్యంత ప్రీతికరమైన తమలపాకులతో అష్టోత్తర పూజలు చేశారు. ఆలయ ప్రదక్షిణలు, తలనీలాలు, అన్నప్రాసన, వాహన పూజలతో మొక్కులు తీర్చుకున్నారు. స్వామి వారి దర్శనార్థం వచ్చిన 1900 మంది భక్తులకు ఆలయ నిత్యాన్నదాన సత్రంలో అన్నప్రసాదాన్ని అందజేశారు. మంగళవారం ఒక్కరోజు వివిధ సేవల రూపంలో ఆలయానికి రూ.2,15,450 ఆదాయం సమకూరినట్టు ఆలయ ఈవో ఆర్‌వి చందన తెలిపారు.


గుర్రపు డెక్కతో పూడుకుపోయిన మొగల్తూరు ప్రధాన కాలువ

మొగల్తూరు కాలువకు

కాలుష్యం కాటు

గుర్రపుడెక్క కళేబరాలతో దుర్వాసన
ఈ నీరే కొన్ని గ్రామాలకు తాగునీరు


మొగల్తూరు న్యూచానల్ దుస్థితి

మొగల్తూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): నిడదవోలు నుంచి వచ్చే మొగల్తూరు ప్రధాన కాలువ కాలుష్య కోరల్లో చిక్కుకున్నది. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే జంతు, మానవ మృత కళేబరాలతో పాటు ఎగువ ప్రాంతంలో గల డ్రెయిన్ నీరు పలు ప్రాంతాల్లో ఈ కాలువలో కలుస్తోంది. నిడదవోలు నుంచి వచ్చే ఈ ప్రధాన మొగల్తూరు శివారు ప్రాంతం ఇక్కడ మిగులు నీరు ఉప్పుటేరులో కలుస్తోంది. మండలంలోని మొగల్తూరు, రామన్నపాలెం, కెపిపాలెం నార్త్, సౌత్, పేరుపాలెం నార్త్, సౌత్ గ్రామాలకు ఈ కాలువ నీరే ఆధారం.

కాలుష్యం నీరే.. తాగునీరు

ఈ కాలువ కాలుష్యంపై ఎన్ని ఫిర్యాదులు చేసినా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదు. ఫలితంగా కాలువ వెంబడి దుర్వాసన రావడంతో వాసన భరించలేక ముక్కు మూసుకుంటున్నారు. ఇదే నీటిని మొగల్తూరు, కెపిపాలెం మంచినీటి ప్రాజెక్టుకు తోడుతున్నారు. కాలువ నీరు కాలుష్యంగా ఉందని ఈనీటిని మంచినీటి ప్రాజెక్టులకు లిఫ్ట్ చేయవద్దని ఆర్‌డబ్ల్యుఎస్, గ్రామ పంచాయతీలకు ఫిర్యాదులు చేసినా ఇదే నీటిని లిఫ్ట్ చేస్తున్నారని ఫలితంగా ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారని తీర గ్రామాల ప్రజలు ఆవేదన చెందుతున్నారు. కనీసం మొగల్తూరు లాకు తలుపులు తెరిచి ఉప్పుటేరులోకి కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలను మళ్లిస్తే సమస్య పరిష్కారం అయ్యేది. అసలు లాకు తలుపులు తెరవడం లేదు. గతంలో ఇదే కాలువలో పడవల సంచారం ఉండటంతో కాలుష్యం సమస్య కొంత వరకు తగ్గేది.

గుర్రపు డెక్కతో పూడుకుపోయిన చానల్స్

మొగల్తూరు ప్రధాన కాలువతో పాటు న్యూచానల్, జంగిల్ చానల్, పంట కాలువలు గుర్రపుడెక్కతో పూడుకుపోతున్నాయి. కాలువ, చానల్స్ కంటికి నీరు కనిపించకుండా గుర్రపు డెక్క, తూడు అల్లుకుపోయింది. ఇక మొగల్తూరులోని 45, 46 డీపీ చానల్స్ పూర్తిగా పూడుకుపోయి నీటి ప్రవాహం జరగడం లేదు. ఫలితంగా మొగల్తూరు, కెపిపాలెం గ్రామాల్లో పంట పొలాలకు సాగునీరు అందే పరిస్థితి లేకపోవడంతో వేలాది ఎకరాల్లో సాగు చేయడం లేదు.

కాలువల ప్రక్షాళన చేయాలి



తీర గ్రామాలకు సాగు, తాగునీరు అందించే ప్రధాన కాలువ ప్రక్షాళన చేయాలి. ఇదేనీటిని మంచినీటి ప్రాజెక్టులకు లిఫ్ట్ చేయడంతో ఆనీటిని తాగిన వారంతా రోగాల బారిన పడుతున్నారు.

- బస్వాని ఏడుకొండలు, లాకుపల్లవపాలెం

శివారుకు సాగునీరు అందడం లేదు



కాలువలు కాలుష్యం కోరల్లో చిక్కుకోవడంతో పాటు అనుసంధానంగా ఉండే చానల్స్‌లోనూ గుర్రపు డెక్క, తూడు పేరుకుపోయాయి. ఫలితంగా శివారు ప్రాంతాలకు సాగునీరు అందడం లేదు. దీనితో డెల్టా తీరంలో దాళ్వా సాగు ప్రశ్నార్థకంగా మారనుండటంతో ప్రజా ప్రతినిధులు దృష్టి సారించాలి

- కడలి సాంబాబు, సర్పంచ్ కెపిపాలెం నార్త్

క్షేత్రస్థాయి పరిశీలనతోనే మండలాధ్యక్షుల ఎంపిక

ఏఐసీసీ జాతీయ కార్యదర్శి ప్రవీణ్ దావర్



పెదవేగి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుల ఎంపిక క్షేత్రస్థాయి పరిశీలనతోనే నిర్వహిస్తావని ఏఐసీసీ జాతీయ కార్యదర్శి, ఏలూరు జిల్లా పరిశీలకుడు ప్రవీణ్ దావర్ అన్నారు. ముండూరులో పార్టీ నియోజకవర్గ కన్వీనర్ ఆలపాటి నరసింహమూర్తి అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశంలో పాల్గొన్న ప్రవీణ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయిలో బలోపేతం చేసి, స్థానిక సంస్థల ఎన్నికల్లో పాగా వేసేందుకు అనువుగా పార్టీ నాయకులు ఇప్పటినుంచే కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహనరావు, దెందులూరు నియోజకవర్గం కన్వీనర్ ఆలపాటి నరసింహమూర్తి, పార్టీ నాయకులు నోబుల్, చిలకలపూడి తాతకృష్ణ, బండి విజయ్, నేతల సుబ్బారావు, రంభ కిషోర్, యోహాను, ఆలపాటి చౌదరి, గౌతు సత్యాంధ్ర తదితరులు పాల్గొన్నారు.

నాలుగు రైళ్ల పొడిగింపు

ఏలూరు క్రైం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి):ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ప్రస్తుతం నడుస్తున్న నాలుగు ప్రత్యేక రైళ్ళను మరికొంత కాలం పొడిగిస్తూ దక్షిణ మధ్య రైల్వే అధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రైల్ నెంబర్ 07035 చర్లపల్లి-అనకాపల్లి ప్రతి శనివారం నడుస్తున్న ఈ రైలు డిసెంబరు 6 నుంచి వచ్చే ఏడాది జనవరి 17 వరకూ నడపనున్నట్లు తెలిపారు. 07036 అనకాపల్లి - చర్లపల్లి ప్రతి ఆదివారం నడుస్తున్న ఈ రైలు డిసెంబరు 7 నుంచి వచ్చే ఏడాది జనవరి 18 వరకూ నడపనున్నారు. ఈ రైళ్ళు సికింద్రాబాద్, చర్లపల్లి, జన్‌గాం, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం, మధిర, రాయన్నపాడు, ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, తుని, యలమంచిలి రైల్వే స్టేషన్లలో ఆగుతుందని ఈ రైళ్ళల్లో సెకండ్ క్లాస్ ఏసీ, త్రీ టైర్ ఏసీ, స్లీపర్ క్లాస్ అండ్ జనరల్ సెకండ్ క్లాస్ బోగీలు ఉంటాయన్నారు. రైల్‌నెంబర్ 07055 సికింద్రాబాద్ - అనకాపల్లి ప్రతి గురువారం నడుస్తున్న ఈ ప్రత్యేక రైలును డిసెంబరు 4 నుంచి వచ్చే ఏడాది మార్చి 26 వరకూ పొడిగించినట్లు, రైల్ నంబర్ 07056 అనకాపల్లి - సికింద్రాబాద్ ప్రతి శుక్రవారం నడుస్తున్న ఈ రైలును డిసెంబరు 5 నుంచి వచ్చే ఏడాది మార్చి 27 వరకు పొడిగించామన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులను సస్పెండ్ చేయడం దారుణం



భీమవరంలో ధర్నా చేస్తున్న నాయకులు

భీమవరంటౌన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి):ఏలూరు ఆర్టీసీ పెట్రోల్ బంకులో జరిగిన అవినీతి కుంభకోణంలో సంబంధంలేని ఉద్యోగుల్ని సస్పెండ్ చేశారంటూ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ భీమవరం డీపీటీ జిల్లా కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఎటువంటి విచారణ చేయకుండా కొద్ది మంది ఉద్యోగుల దగ్గర బలవంతంగా సొమ్ము రికవరీ చేసి అసలు సంబంధంలేని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ సుందరయ్య, ఎంప్లాయిస్ యూనియన్ నాయకుడు ఎమ్మెస్‌రావు మరొకరిని అన్యాయంగా సస్పెండ్ దారుణమని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె రాజారామోహన్ రాయ్, యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం.రాయుడు అన్నారు. ఈ కుంభకోణంలో ఆర్టీసీ ఇతర అధికారులతో విచారణ చేయించి అసలు దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ ఆర్టీసీ ఎండి జోక్యం చేసుకుని సమగ్ర న్యాయ విచారణ చేయాలని చట్ట వ్యతిరేకంగా సస్పెండ్ చేసిన ఉద్యోగులను వెంటనే విధుల్లో తీసుకోవాలని వారి డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి. వాసుదేవరావు సీఐటీయూ నాయకుడు ఎం. ఆంజనేయులు ఆర్టీసీ నాయకులు నారాయణ మూర్తి, రాజశేఖర్‌ప్రసాద్, శ్రీనివాస్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.


జడ్పీ సమావేశంలో ఎమ్మెల్యేలు మద్దిపాటి, బొలిశెట్టి, ఎమ్మెల్సీ రవీంద్ర, జడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ, కలెక్టర్ వెట్రి సెల్వి తదితరులు

రహదారులను బాగు చేయండి

- జడ్పీ సర్వసభ్య సమావేశంలో గళమెత్తిన జడ్పీటీసీలు
- ధాన్యం సేకరణలో ఇబ్బందులు రానివ్వద్దన్న జడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ
- రైతుల సమస్యలు తెలుసుకుంటున్నామన్న కలెక్టర్ వెట్రి సెల్వి

ఏలూరు సిటీ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఏలూరులో ఉమ్మడి పశ్చిమ గోదావరి జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ అధ్యక్షతన మంగళవారం జడ్పీ సర్వ సభ్య సమావేశం జరిగింది. రహదారుల దుస్థితిపై జడ్పీటీసీలు ప్రస్తావించారు. కొన్ని పాఠశాలల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, విలేజ్ హెల్త్ క్లినిక్ నిర్మాణాలను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ధాన్యం సేకరణలో రైతుల సమస్యలను గుర్తించి పరిష్కరించాలని చైర్‌పర్సన్ పద్మశ్రీ అధికారులను ఆదేశించారు. ప్రస్తుత వ్యవసాయ సీజన్‌లో రికార్డు స్థాయిలో 4.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా నిర్దేశించారని, ధాన్యం సేకరించిన గంటల వ్యవధిలోనే రైతులకు ధాన్యం సొమ్ము ప్రభుత్వం జమ చేస్తోందన్నారు. సాగులో యాంత్రీకరణను ప్రోత్సహిస్తున్నామని, జిల్లాలో ఇప్పటికే 51 డ్రోన్స్ రైతులకు అందించామన్నారు. ఈ-పంట నమోదు నూరుశాతం పూర్తి చేశామన్నారు. రైతులకు నాణ్యమైన గోనె సంచులు అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. 10వ తరగతిలో జిల్లాను రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిపేలా చర్యలు తీసుకోవాలని, రహదారులపై గుంతలు లేకుండా చూడాలని, ప్రభుత్వ ఆస్పత్రులలో మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు.

- **ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్** మాట్లాడుతూ జల్‌జీవన్ మిషన్ పథకం కింద చేపట్టిన పనులు నిర్దేశించిన సమ యంలోగా పూర్తి చేయాలని, గుంతలు లేని రహదారులు ఉండేలా ఆర్‌అండ్‌బీ అధికారు లు చర్యలు తీసుకోవాలన్నారు. పీహెచ్‌సీ భవనాలు పూర్తి చేయాలన్నారు.
- **జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి** మాట్లాడుతూ రైతన్నా.. మీకోసం కార్యక్రమం ద్వారా ప్రతి రైతు ఇంటికెళ్ళి వ్యవసాయంలో వారు ఎదుర్కొనే సమస్యలు, అభిప్రాయాలను యాప్‌లో వ్యవ సాయ అధికారులు పొందుపరుస్తున్నారన్నారు. రాబోయే రబీ, ఖరీఫ్ అనంతరం రబీ సీజన్లకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికలను వ్యవసాయాధి కారులు రూపొందిస్తున్నారన్నారు.
- **ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్** మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలో మౌలిక సదుపాయాలపై విద్యాశాఖాధికారులు పర్య వేక్షణ ఉండాలన్నారు. ప్రైవేట్ పాఠశాలలో సరైన టాయిలెట్లు లేని కారణంగా టాయిలెట్‌కు వెళ్ళాల్సి వస్తుందనే భయంతో విద్యార్థులు నీరు తాగడంలేదని, ఈ కారణంగా వారిలో శారీరక రుగ్మతలు తలెత్తే అవకాశం ఉందన్నారు. విద్యాశాఖాధికారులు ప్రైవేట్ పాఠశాలలో సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. తణుకు వద్ద పశుమాంస కబేళాలు నిర్వహిస్తున్నారని, పర్యావరణానికి ముప్పు కలగటమే గాక ప్రజలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని, సమస్య పరిష్కరించాలన్నారు.
- **గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు** మాట్లాడుతూ జడ్పీ నిధుల మంజూరులో అధిక జనాభా కలిగిన గోపాలపురం నియోజకవర్గానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా నీట మునిగిన పంటలకు నష్టం కలుగకుండా తీసుకోవాల్సిన చర్యలపై వ్యవసాయ శాస్త్రవేత్తలతో రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రైతుల సంక్షేమంలో ప్రతిపక్ష సభ్యులు రాజకీయం చేయవద్దన్నారు. గత ప్రభుత్వం గోపాల పురం నియోజకవర్గంలో 29వేల 385 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరిస్తే, గత వ్యవసాయ సీజన్‌లో 48 వేల 787 మెట్రిక్‌టన్నుల ధాన్యా న్ని సేకరించామని, గత ప్రభుత్వం రైతులకు ధాన్యం సొమ్ములు అందజేసేందుకు నెలల తరబడి ఆలశ్యం చేస్తే, తమ ప్రభుత్వం గంటల వ్యవధిలోనే సొమ్ము జమచేస్తున్నదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల్లో సృజనాత్మకత, క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించేందుకు బాలోత్సవం వంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.


సమావేశానికి హాజరైన జడ్పీటీసీలు

సమావేశంలో జిల్లా పరిషత్ సీఈఓ ఎం. శ్రీహరి, పశ్చిమగోదావరి జిల్లా డీఆర్‌వో బి శివనారాయణ రెడ్డి, కొవ్వూరు ఆర్డీఓ రాణి సుస్మిత, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలకు చెందిన వివిధ శాఖల అధికారులు, జడ్పీటీసీలు, ఎంపీపీలు తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా స్థాయి సంఘ సమావేశాలు..

ఏలూరు సిటీ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి 1 నుంచి 7 వరకు జడ్పీ స్థాయి సంఘాల సమావేశాలు సాదాసీదాగా జరిగాయి. 2, 4 స్థాయి సంఘాలకు జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీప్రసాద్ అధ్యక్షత వహించగా, 1, 7 స్థాయి సంఘాల సమావేశాలకు జంగారెడ్డిగూడెం, నిడదవోలు జడ్పీటీసీలు పోలినాటి బాబ్జి, కె.సూర్యారావు అధ్యక్షత వహించారు. 3, 5, 6 స్థాయి సంఘాల సమావేశాలు కూడా నిర్వహించారు.

ఏలూరు, పశ్చిమ, తూర్పుగోదావరి జిల్లాలకు చెందిన వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు. ప్రధానంగా ఇళ్ళు, ఇళ్ళ స్థలాలు, రోడ్ల దుస్థితి, విద్య, వైద్యం, విద్యుత్ సమస్యలపై జడ్పీటీసీ సభ్యులు ప్రస్తావించారు. జిల్లాలో రహదారులు అధ్వానంగా ఉన్నాయని, వాటికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని పేర్కొన్నారు. పంచాయతీల తీర్మానాలు లేకుండా పలు పరిశ్రమలు గ్రామాల్లో ప్రారంభిస్తున్నారని జంగారెడ్డిగూడెం జడ్పీటీసీ పోలినాటి బాబ్జి అన్నారు. పంచాయతీ పన్నులు గతంలోకన్నా ఎక్కువగా వస్తున్నాయని వాటిపై ప్రజల్లో అవగాహన కల్పించాలని జడ్పీటీసీలు కోరారు. పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్, పంచాయతీ శాఖ, డ్వామా, ఆర్‌డబ్ల్యుఎస్, విద్యుత్, విద్యా, ఆరోగ్య, మైనింగ్, పౌరసరఫరాల శాఖలతోపాటు వివిధ శాఖలపై ఈ సమావేశాలలో ప్రధానంగా చర్చించారు. సమావేశాల్లో జడ్పీ సీఈఓ ఎం.శ్రీహరి, డిప్యూటీ సీఈఓ కెబీమేశ్వర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నేడు భీమవరంలో మెగా జాబ్ మేళా

భీమవరం టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మెప్మా ఆధ్వర్యంలో భీమవరం మునిసిపాల్టీలో బుధవారం ఉదయం మెగా జాబ్ మేళా నిర్వహించనున్నారు. మెప్మా పీడీ జి. హెప్సిబా మాట్లాడుతూ మెప్మా నిపుణ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుని 16 కంపెనీలతో జిల్లా స్థాయిలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తోందని, ఉదయం 9 గంటలకు మేళా ప్రారంభమవుతుందన్నారు. మెప్మా నిపుణలో ఇప్పటికే రిజిస్ట్రేషన్ అయిన వారితో పాటు నిరుద్యోగ యువతీ యువకులు, తమ విద్యార్హతల సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, ప్రజా ప్రతినిధులు కూడా హాజరు అవుతారని తెలిపారు.

పాఠశాలలకు నేడు సెలవు ఇవ్వాలి

ఏలూరు అర్బన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : సుబ్రహ్మణ్య షష్ఠిని ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో వైభవంగా జరుపుకునే సాంప్రదాయం ఉన్నందున ఈ నెల 26న గోదావరి జిల్లాల్లోని అన్ని పాఠశాలలకు స్థానిక సెలవు (లోకల్ హాలీడే)గా వినియోగించుకునేలా అవకాశం కల్పించాలని కోరుతూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను కోరినట్టు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బి.గోపిమూర్తి తెలిపారు. ఇలా సెలవు వినియోగించుకునే పాఠశాలల్లో రాజ్యాంగ దినోత్సవాన్ని మరుసటిరోజు అంటే 27న జరుపుకునేలా ఆదేశాలు జారీచేయాలని కోరామన్నారు.

కవి పార్థసారథికి అవార్డు



ఏలూరు రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కవి, రచయిత, ట్రైబల్ వెల్ఫేర్ విశ్రాంత అధికారి డాక్టర్ టి. పార్థసారథి పాన్ ఇండియా సోషియో కల్చరల్ అసోసియేషన్ లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డును విజయవాడలో అందుకున్నారు. సాంస్కృతిక, సాహిత్య మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ డాక్టర్ డాక్టర్ రాయపాటి శైలజ, ఎమ్మెల్సీ సోము వీర్రాజు చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. పాన్ ఇండియా అధ్యక్షుడు అద్దంకి రాజు యోనా, శ్రీశ్రీ కళావేదిక, మేనేజింగ్ డైరెక్టర్ కత్తిమండ ప్రతాప్ తదితరులు పార్థసారథిని అభినందించారు.

'చవాకుల'కు ఇన్‌స్పైర్ అవార్డు



పాలకొల్లు టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పాలకొల్లుకు చెందిన చవాకుల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ చవాకుల సూర్య నరేష్‌బాబు సేవా కార్యక్రమాలను గుర్తించి పాన్ ఇండియన్ సోషియో కల్చరల్ అసోసియేషన్ (విజయవాడ) ఇన్‌స్పైర్-2025 అవార్డును విజయవాడ లో అందజేశారు. అవార్డు గ్రహీత నరేష్ బాబు మంగళవారం విలేకర్లకు తెలిపారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు, రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్మన్ డాక్టర్ రాయపాటి శైలజ చేతులమీదుగా అవార్డు అందుకున్నట్టు తెలిపారు. పాన్ ఇండి యా సోషియో కల్చరల్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి


అయిశెట్టి అన్నపూర్ణ

నరసాపురం రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వైఎస్‌పాలెం గ్రామానికి చెందిన అయిశెట్టి అన్నపూర్ణ(115) మంగళవారం మృతి చెందారు. 1910లో జన్మించిన ఆమెకు ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు, మనవ ళ్లు, ముని మనవరాళ్లు ఉన్నారు. ఆమె మృతి పట్ల కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, సర్పంచ్ వైఎస్ నాగముత్యమాంబ, వైఎస్ బాబులు, వాసు సంతాపం తెలిపారు.

కల్తీ పెట్రోల్ అంటూ సోషల్ మీడియాలో హల్‌చల్



పాలకోడేరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): శృంగవృక్షం గ్రామంలోని జాతీయ రహదారిని చేర్చి ఉన్న పెట్రోల్ బంక్‌లో కల్తీ పెట్రోల్ వస్తోందంటూ కొంత మంది యువకులు సోషల్ మీడియా ద్వారా మంగళవారం హల్‌చల్ చేశారు. శృంగవృక్షంలోని ఒక పెట్రోల్ బంక్‌లో గత కొద్ది రోజులుగా పెట్రోల్‌లో నీళ్లు కలిసి బైక్‌లు పాడవుతున్నాయం టూ పెట్రోల్ బంక్ యాజమాన్యంతో మంగళవారం వాగ్వాదానికి దిగారు. ఈ పెట్రోల్ బంక్‌లో పెట్రోల్ వేయించుకోవడం ద్వారా తమ బైక్‌లు పాడవుతున్నాయని, అలా ఎందుకు జరుగుతుందని నిలదీశారు. అక్కడితో ఆగకుండా పెట్రోల్‌ను బాటిల్‌లో పట్టాలంటూ పట్టుబట్టి బాటిల్‌లో కొట్టించగా, ఆ బాటిల్‌లో పెట్రోల్‌కు బదులు నీళ్ళు వచ్చాయంటూ హల్‌చల్ చేశారు. ఇది కాక అధికారుల దృష్టికి వెళ్ళడంతో పాలకోడేరు డిప్యూటీ తహసీల్దార్ శేషయ్యనాయుడు బంక్‌ను పరిశీలించారు. బంక్ మేనేజర్ సునీల్‌కుమార్‌తో అధికారులు మాట్లాడగా పవర్ పెట్రోల్‌లో ఇథనాల్ సరిగా కలవకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని, తాము కల్తీ పెట్రోల్ అమ్మడం లేదంటూ బదులిచ్చారు. ఉన్నతాధికారుల సూచనలతో బంక్‌లో ఉన్న ఆ పంప్‌ను నిలుపుదల చేశారు. అయితే ఆ బంక్‌లో పెట్రోల్ కొట్టించుకున్న యువకులు మాత్రం ఈ బంక్‌లో తరచూ కల్తీ జరుగుతుందని, తద్వారా బైక్‌లు పాడవుతున్నాయని ఆరోపించారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని ఈ బంక్‌పై తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఐస్ క్రీం తయారీ కేంద్రంపై విజిలెన్స్ అధికారుల దాడి


ఐస్‌క్రీమ్‌లను తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

భీమవరం క్రైం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): భీమవరం ఇండస్ట్రియల్ ఏరియాలో విజిలెన్స్ ఆహార తనిఖీ, తూనికలు కొలతల అధికారులు సంయుక్తంగా ఐస్‌క్రీం తయారీ కేంద్రంలో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. మెస్సర్స్, సూర్యతేజ ఫుడ్స్‌లో తనిఖీ చేయగా ఆ షాపులో గడువు తీరిన నాలుగు రకాల ఐస్‌క్రీమ్‌లు గుర్తించారు. వాటి నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపించినట్లుగా అధికారులు తెలిపారు. ఆహార భద్రత చట్టం ప్రకారం కేసు నమోదు చేయడం జరిగిందని, తక్కువ తూకం ఉన్న ఐస్‌క్రీమ్‌లు, ఎటువంటి ధృవీకరణలు లేనటువంటి రెండు కాటాలు గుర్తించి తూనికలు, కొలతల చట్టం ప్రకారం రెండు కేసులు నమోదు చేసినట్లు విజిలెన్స్ ఎస్‌ఐ కె.సీతారాం తెలిపారు. ఈ తనిఖీల్లో తూనికలు, కొలతల అధికారి మోహనరావు, ఆహార తనిఖీ అధికారి రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొల్లేరులో వరి సాగుకు రైతుల యత్నం

అడ్డుకున్న అటవీశాఖ అధికారులు



ఆందోళన చేస్తున్న మహిళలతో మాట్లాడుతున్న పోలీసులు

భీమడోలు/నిడమర్రు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కొల్లేరు ప్రాంతంలో వరి సాగుకు అనుమతి ఇవ్వాల ంటూ నిడమర్రు మండల రైతులు భీమడోలు మం డలం సాయన్నపాలెం సమీపంలో ఆందోళన నిర్వహి ంచారు. నిడమర్రు మండలం తోకలపల్లికి చెందిన సు మారు 500 మంది డి-ఫారం పట్టా రైతులు మంగళవారం సాయన్నపాలెంలోని సుమారు 1680 ఎకరాల కొల్లేరు ప్రాంతంలోకి చొరబడేందుకు ప్రయత్నించారు. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికా రులు, నిడమర్రు పోలీసు అధికారులు రైతుల్ని అడ్డు కున్నారు. ఈ నేపథ్యంలో తోపు లాట జరిగింది. 1959 లో నిడమర్రు, ఉంగుటూరు మండలాలకు చెందిన కొల్లేరు పరీవాహక ప్రాంతాలైన తోకలపల్లి, బైనేపల్లితో పాటు మరికొన్ని గ్రామాలకు చెందిన పేదలకు సంప్రదాయ వ్యవసాయ సాగు నిమిత్తం ఈ ప్రాంత ంలో 1680 ఎకరాలు కొల్లేరు భూమిని ఒకొక్కరికి 40 సెంట్లు చొప్పున పంపిణీ చేశారని ఆ డి-ఫారం పట్టాలతో సంప్రదాయ వరిసాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని రైతులు పేర్కొన్నారు. ఇటీవల సుప్రీంకోర్టు కొల్లేరు భూముల్లో సాగు చేయరాదని ఆదేశాలిచ్చిన నేపథ్యంలో అధికారులు సాగు జరగని వ్వడం లేదని రైతులు ఆందోళన నిర్వహించారు. దీం తో ఘటనా స్థలికి చేరుకున్న అటవీ శాఖ ఏలూరు రేంజర్ మోహినీ లక్ష్మి తదితర అధికారులతో రైతులు వాగ్వాదానికి దిగారు. తాతల కాలం నుంచి ఈ ప్రాం తంలో తాము వరిసాగు చేస్తున్నామని ఇప్పుడు వద్దం టే ఎలా అని ప్రశ్నించారు. అధికారులను నెట్టుకుంటూ రైతులు ముందుకు వెళ్ళేందుకు ప్రయత్నించగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. రైతులు, మహిళలు రోడ్డుపై బైఠాయించి న్యాయం చేయాలంటూ నినాదాలు చేశా రు. పోలీసులు, అటవీశాఖ అధికారులు ఆందోళనకారు లతో చర్చించి రైతుల వద్ద ఉన్న డి. ఫారం పత్రాలు అందజేస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారా నికి కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళనను విరమించారు.

మతిస్థిమితం లేని వ్యక్తి పోలీసులపై దాడి

తాడేపల్లిగూడెం రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి):జనసంచారం రద్దీగా ఉన్న సమయంలో విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులపై అకస్మాత్తుగా ఓ వ్యక్తి రాయి, కత్తితో దాడికి తెగబడ్డాడు. వాహన చోదకులను లక్ష్యంగా చేసుకుని దాడికి వెళ్తుండగా వారించిన పోలీసులపై ఎదురు దాడికి దిగాడు. ఆ వ్యక్తిని అడ్డుకునేందుకు స్థానికులంతా భయపడ్డారు. ఒక చేతిలో రాయి, మరో చేతిలో కత్తి పట్టుకుని అందరిని హడలెత్తించాడు. చాకచక్యంగా పట్టుకుని చేతిలోని కత్తిని లాక్కున్నారు. అతను యాగర్లపల్లికి చెందిన ఎలుబూడి మధుగా గుర్తించారు. గతంలో ఆ వ్యక్తి చిన్న చిన్న దొంగతనాలకు పాల్పడేవాడని సస్పెక్ట్ షీట్ కూడా ఉండేదని పోలీసులు చెబుతున్నారు. మతిస్థిమితం లేకనే దాడికి పాల్పడ్డాడని అనుమానిస్తున్నారు. ఈ దాడిలో ఏఎస్సై సింగరాజు, కానిస్టేబుల్ భద్రంలకు తీవ్రగాయాలయ్యాయి. వారిని తాడేపల్లిగూడెం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్.ఐ. బాదం శ్రీను తెలిపారు.

చికెన్ వ్యర్థాలతో వాహనం సీజ్



దెందులూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నుంచి కోళ్ల వ్యర్థాలతో తొకలపల్లి వెళ్తున్న ఐషర్ వాహనాన్ని దెందులూరు వద్ద పోలీసులు పట్టుకున్నారు. పెదపాడు మండలం వసంతవాడకు చెందిన మామిడిపల్లి పవన్ కుమార్, వాహనదారుడి మీద, డ్రైవర్ పి.సాంబశివరావుపైన తొకలపల్లి రైతు కొండలుపైన, హైదరాబాద్ చికెన్ సరఫరా దారుడిపైన మొత్తం నలుగురిపై కేసులు నమోదు చేశామని ఎస్‌ఐ ఆర్.శివాజీ తెలిపారు.

సహ జీవనం చేస్తున్న మహిళపై కత్తితో దాడి

రెండు చేతులకు తీవ్రగాయాలు

కైకలూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో సహజీవనం చేస్తున్న మహిళపై కత్తితో వ్యక్తి దాడి చేసిన సంఘటన కైకలూరులో సంచలనం కలిగించింది. పోలీసుల కథనం ప్రకారం 15సంవత్సరాల క్రితం ఒక మహిళ భర్త నుంచి దూరమై కైకలూరు మండలం సీతనపల్లిలో నివసిస్తోంది. అయితే అదే గ్రామానికి చెందిన ఏసోబుతో పరిచయం ఏర్పడి అప్పటి నుంచి సహ జీవనం సాగిస్తోంది. అయితే ఇటీవల 6 నెలల నుంచి ఏసోబుకు ఆ మహిళతో డబ్బుల విషయంలో వివాదం రావడంతో విభేదాలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో ఆమె కైకలూరులోని ఇస్లాం పేట వద్ద ఆమె బంధువుల ఇంటి వద్ద తన కుమార్తెను ఉంచి పనులు చేసుకునేందుకు విజయవాడ వెళ్లింది. ఈ నెల 24న తిరిగి కైకలూరు వచ్చింది. ఏసోబు నాలుగు రోజులుగా కైకలూరులోని బంధువుల ఇంటి చుట్టూ మద్యం మత్తులో తిరు గుతున్నాడు. సదరు మహిళ వచ్చిన విషయం తెలుసుకుని మంగళవారం ఇంటికి వచ్చి సీతనపల్లి వెళ్దామంటూ ఒత్తిడి తేవడంతో ఆమె నిరాకరించింది. దీంతో ఇరువురి మధ్య వివాదం చోటుచేసుకుంది. అప్పటికే పథకం ప్రకారం తెచ్చుకున్న కత్తితో మహిళపై దాడి చేశాడు. ఈ దాడిలో ఆమె రెండు చేతులకు గాయాలయ్యాయి. బాధితురాలి కేకలు విన్న చుట్టుపక్కల వాళ్లు రావడంతో ఏసోబు అక్కడి నుంచి పారిపోయాడు. దీంతో బాధితురాలిని బంధువులు కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం ఆమెను మెరుగైన చికిత్స కోసం ఏలూరు తీసుకువెళ్లారు. కైకలూరు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పానకంలో మత్తు మాత్రలు కలిపి..మెడలో బంగారు గొలుసు చోరీ

ముసునూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పానకంలో మత్తు మాత్రలు కలిపి ఇచ్చి మహిళ మెడలో బంగారు గొలుసు అపహరించుకుపోయిన సంఘటనపై ముసునూరు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం మండలంలోని వలసపల్లి గ్రామానికి చెందిన బండారుపల్లి జయలక్ష్మి ఒంటరిగా జీవిస్తుంది. అయితే సుమారు 15 రోజుల క్రితం జయలక్ష్మి ఇంటి పక్కన వల్లభనేని బసవపూర్ణమ్మ ఇంటిలో గుంటూరు జిల్లాకు చెందిన వెంకట్ అనే వ్యక్తి అద్దెకు ఉంటున్నాడు. అతడు బాధితురాలిని పెద్దమ్మ అని పిలుస్తూ పరిచయం పెంచుకున్నాడు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం వెంకట్ తనకు ప్రమోషన్ వచ్చిందని, మంగళగిరి పానకాల స్వామి గుడికి వెళ్లి మొక్కు తీర్చుకుని వచ్చానని, పానకం ప్రసాదంగా ఇచ్చాడు. ఈ పానకం తాగిన కొద్ది సేపటికి జయలక్ష్మి స్పృహకోల్పోయింది. ఆమె మెడలోని 8 కాసుల బంగారు గొలుసును దొంగిలించి వెంకట్ పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ బేగ్ తెలిపారు. నూజివీడు సీఐ కె.రామకృష్ణ ఆధ్వర్యంలో నిందితుడిని గుర్తించి, పట్టుకునేందుకు ప్రత్యేక పోలీస్ బృందాలు గాలిస్తున్నాయి.

వివాహిత ఆత్మహత్య

నిడమర్రు నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పెదనింద్రకొలనులో కుటుంబ కలహాలతో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. నిడమర్రు ఎస్సై రమేష్ తెలిపిన వివరాలివి.. పిరిడి మౌనిక(25), భర్త సంజీవరావులకు ఇద్దరు కుమారులు. కొంత కాలంగా జరుగుతున్న కుటుంబ కలహాల కారణంగా సోమవారం మౌనిక ఉరి వేసుకొంది. కుటుంబ సభ్యులు గమనించి ఆమె ఆసుపత్రికి తరలించినప్పటికి అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మౌనిక తండ్రి కొచ్చర్ల ప్రసాద్ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

గ్యాస్‌పై టపాసులు కాల్చిన చిన్నారులు.. తీవ్ర గాయాలు

మొగల్తూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు కూలిపనికి వెళ్లిన సమయంలో ఇంటిలో వున్న ఇద్దరు పిల్లలు గ్యాస్ పొయ్యిపై టపాసులు కాల్చడంతో అవి పేలి తీవ్ర గాయాలయ్యాయి. మొగల్తూరు నాగదేవత కాలనీకి చెందిన కుమారి సాయి, నాగులమ్మలకు ఆసబు(11), బాబి (7) ఇద్దరు కుమారులు. తల్లిదండ్రులు కూలి పనులకు వెళ్లిన సమయంలో గ్యాస్ పొయ్యి వెలిగించి టపా సులు అంటించడంతో అవి చేతిలోనే పేలిపోయి బాబి మణికట్టు వరకు తెగిపడింది. ఆసబుకు కాలు కాలింది. ఒక్కసారిగా పేలుడు సంభవించడంతో కాలనీ వాసులు భయాందోళనకు గురయ్యారు. వీరిని నరసాపురంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం భీమవరం తరలించారు.

చెక్ బౌన్స్ కేసులో జైలు శిక్ష

ఏలూరు క్రైం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి):చెక్కు బౌన్స్ కేసులో మహిళకు ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ ఏలూరులోని కోర్టు మంగళవారం తీర్పు చెప్పింది. ఏలూరు పడమరవీధి గాంధీ మైదానం ప్రాంతానికి చెందిన ఆరేపల్లి సుమలత ఏలూరుకు చెందిన మేడపాటి సుధాకర్‌రెడ్డి వద్ద 2022 ఏప్రిల్ 20న ఆరున్నర లక్షల సొమ్మును తీసుకున్నారు. ఆ బాకీ తీర్చే క్రమంలో 2023 మే 5న ఐదు లక్షలకు చెక్కును సుధాకరరెడ్డికి ఇచ్చారు. ఆ చెక్కును బ్యాంకులో సుధా కరరెడ్డి జమ చేయగా సుమలత అకౌంట్లో సరిపడా సొమ్ములు లేవని చెక్కు బౌన్స్ అయింది. సుమలతపై కోర్టులో కేసు వేశారు. ఆపై నేరం రుజువు కావడంతో కోర్టు శిక్ష వేసింది.

ఎక్సైజ్ దాడుల్లో ముగ్గురి అరెస్టు



ఏలూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా చింతలపూడి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని కామవరపుకోట, చింతలపూడి, టి.నర్సాపురం మండలాల్లో ఎక్సైజ్ సూపరింటెండెంట్ టాస్క్‌ఫోర్సు అధికారులు మంగళవారం విస్తృతంగా బెల్టుషాపులు, సారా కేంద్రాలపై దాడులు నిర్వహిం చారు. కె.కోట గ్రామానికి చెందిన చిట్టిబొమ్మ వెంకట రంగారావు లీటరు సారాతోను, చింతలపూడి మండలం తిమ్మిరెడ్డిపాలెం గ్రామంలో అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న కొనకళ్ల చెన్నారావు నుంచి 8 మద్యం సీసాలతో అరెస్టు చేశారు. టి.నర్సాపురం మండలం బందంచెర్ల గ్రామం లో దానం చంటి అనే వ్యక్తి నుంచి 50 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి రెండు లీటర్ల సారా స్వాధీనపర్చుకున్నారు. నిందితులపై కేసులను నమోదు చేసినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆవులయ్య తెలిపారు.

నిరుద్యోగ యువతకు కంప్యూటర్ హార్డ్‌వేర్‌లో శిక్షణ

ఏలూరుటూటౌన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి):నిరుద్యోగ యువతకు కంప్యూటర్ హార్డ్‌వేర్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు డీఎల్‌టీసీ ప్రధానాచార్యులు భూషణం తెలిపారు. ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన పథకంలో ఫీల్డ్ టెక్నీషియన్ కంప్యూటరింగ్ అండ్ పెరిపెరల్స్(కంప్యూటర్ హార్డ్‌వేర్)లో మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. ఇంటర్, ఆపైన ఉత్తీర్ణులై 15 - 35 సంవత్సరాలలోపు వారు అర్హులని, ఈ నెల 30వ తేదీ లోపు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డీఎల్ టీసీలో దరఖాస్తులు అందజేయాలన్నారు. వివరాలకు 94934 82414ను సంప్రదించాలన్నారు.

అయ్యప్ప శరణు ఘోషతో మార్మోగిన వేగివాడ

పెదవేగి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేగివాడ మంగళవారం అయ్యప్ప మాలధారుల శరణుఘోషతో మార్మోగింది. అయ్యప్ప మాలదారులు శబరిమలైకు బయలు దేరుతూ శ్రీఅభయాంజనేయ ఆలయ ప్రాంగణంలో ఇరుముడి కార్యక్రమం ఏర్పాటు చేయడంతో మంగళవారం తెల్లవారు జాము నుంచే అయ్యప్ప శరణుఘోషతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. వేగివాడకు చెందిన 50మంది భక్తులు 40రోజుల పాటు నియమ నిష్టలతో దీక్ష చేసి, దీక్ష కాలం అనంతరం ఇరుముడి కార్యక్రమం చేపట్టారు.

ఏఎస్సార్ నగర్‌కు విద్యుత్, నీటి సౌకర్యం ఇవ్వాలి

టి.నరసాపురం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): టి.నరసాపురం పంచాయతీ పరిధిలోని ఏఎస్సార్ నగర్‌కు కరెంటు నీళ్ల ఇవ్వాలని కోరుతూ స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో జి.మణికుమారికి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. సంఘ జిల్లా ఉపాధ్యక్షులు గుడెల్లి వెంకటరావు మాట్లాడుతూ 17 సంవత్సరాలుగా అల్లూరి సీతారామరాజు నగర్ నివాసులకు విద్యుత్, నీటి సౌకర్యం ఇవ్వకపోవడం దారుణమన్నారు. నాయకులు ఎన్నికల సమయంలో బూటకపు హామీలిచ్చి మొఖం చాటేస్తున్నారని విమర్శించారు.

కలెక్టరేట్ వద్ద ధర్నాను జయప్రదం చేయండి

పోలవరం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి):కేంద్ర కార్మిక సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఏజన్సీ గిరిజన సంఘం పిలుపునిచ్చింది. మంగళవారం ఏజన్సీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కుంజం రామారావు మాట్లాడుతూ పండించే అన్ని పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, కనీస మద్దతు ధరల చట్టం తీసుకురావాలని రైతుల రుణ మాఫీ చేయాలన్నారు. సమస్యల పరిష్కారానికి సంయుక్త కిసాన్ మోర్చా కేంద్ర కార్మిక సంఘాల సమాఖ్య బుధవారం దేశ వ్యాప్తంగా కలెక్టరేట్ల వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్టు ఏజన్సీ గిరిజన సంఘాలు, ప్రజా సంఘాలు పాల్గొనాలన్నారు.

రైతుల సంక్షేమమే లక్ష్యం : ఎమ్మెల్యే ప్రభాకర్

పెదవేగి/ లింగపాలెం/ దెందులూరు/ ద్వారకాతిరుమల, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి సీఎం చంద్రబాబు విశేష కృషి చేస్తున్నారని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. రైతన్నా మీకోసం కార్యక్రమంలో భాగంగా పెదవేగి మండలం కె.కన్నాపురం, తాళ్లగోకవరం, వేగివాడ, చక్రాయ గూడెం, ముండూరు గ్రామాల్లో మంగళవారం సాయంత్రం పర్యటించిన ఎమ్మెల్యే ప్రభాకర్ అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం లబ్ధిదారులకు సీఎం చంద్రబాబు పంపించిన అభినందన లేఖలను నేరుగా అందించారు. లింగపాలెం మండలంలోని రంగాపురంలోని రైతుసేవా కేంద్రం వద్ద మండల వ్యవసాయాధికారి వి.ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో రైతన్నా మీకోసం కార్యక్రమంలో భాగంగా రైతులకు కరపత్రాలు పంపిణీ చేశారు. దెందులూరు మండలంలోని గంగన్నగూడెం, గాలాయగూడెం, గోపన్నపాలెం, సానిగూడెం, సోమవరప్పాడు గ్రామాల్లో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు మోతుకూరి నాని బాబు, డాక్టర్ పసుమర్తి మధుబాబు, గారపాటి కొండయ్య చౌదరి, ఇప్పిలి వెంకటేశ్వరరావు ఉన్నారు. ద్వారకాతిరుమల మండలంలోని ద్వారకాతిరుమల, జి.కొత్తపల్లి సొసైటీల చైర్మన్లు పోలిన శ్రీనివాసరావు, రేగంటి రాంబాబు ఆధ్వర్యంలో తిమ్మాపురం ఎంపీటీసీ కొయ్యలమూడి సరిత, ఘంటా శ్రీనివాసరావులు ప్రచారం చేశారు. పెదవేగి మండలంలో ఎమ్మెల్యే చింతమనేని ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు ఈడ్పుగంటి అనిల్ కుమార్, నెక్కలపూడి సురేష్‌బాబు, పంది ప్రభావతీ సూర్యచంద్రరావు, నున్నా జానకీరామ్, కొనకళ్ల కృష్ణ, బలుసు శ్రీనివాస్ చౌదరి, సుజాన్ పాల్గొన్నారు.

27న మంగళగిరి సీసీఎల్ఏ కార్యాలయం వద్ద ధర్నా

ఏలూరు రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి):నిషేధిత, ఫ్రీ హోల్డ్ భూములపై ఇచ్చిన ఆదేశాలు టీడీపీ ఎన్నికల హామీలకు భిన్నంగా పేదలకు అన్యాయం చేసేలా ఉన్నాయని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శులు పి.రామకృష్ణ, బండి వెంకటేశ్వరరావు విమర్శించారు. మంగళవారం స్ఫూర్తి భవనంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పేదల భూములను పెత్తందార్లకు, కార్పొరేట్లకు కట్టబెట్టేలా చర్యలు ఉన్నాయన్నారు. భూ సమస్యలపై అవగాహన ఉన్న వ్యక్తులు, వ్యవసాయ కార్మిక సంఘాలతో భూ కమిటీలను నియమించి సమగ్రంగా చర్చించి నిజమైన పేదలకు, సన్న, చిన్నకారు రైతులకు న్యాయం చేయాలన్నారు. ఈ నెల 27న జరగతున్న సీసీఎల్ ఆఫీస్ దగ్గర జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

హెచ్ఐవీపై అవగాహన కల్పించాలి : డాక్టర్ భాగ్యశ్రీ

లింగపాలెం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి):హెచ్ఐవీ నిర్మూలనపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కె.గోకవరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ భాగ్యశ్రీ అన్నారు. మండలంలోని పుప్పాలవారిగూడెంలో మంగళవారం ఏలూరు మొబైల్ ఐసీటీసీ సిబ్బందితో కలిసి హెచ్ఐవీ, డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కల్పించారు. బాధితులు ఉంటే జిల్లా వ్యాప్తంగా ఉన్న ఏఆర్‌టీ కేంద్రాల ద్వారా ఉచితంగా మందులు పొందవచ్చన్నారు. ఎటువంటి సందేహాలున్నా జాతీయహెల్ప్‌లైన్ టోల్‌ఫ్రీ నంబర్ 1097కు కాల్ చేసి తెలుసుకోవచ్చన్నారు. ఏలూరు మొబైల్ ఐసీటీసీ సిబ్బంది, బి.హనుమంతంరావు, ఏఎన్ఎం హేమలత, శ్రీవల్లి పాల్గొన్నారు.

పునుకొల్లులో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

దెందులూరు,నవంబరు 25(ఆంధ్రజ్యోతి): క్రీస్తు అందించిన శాంతి, ప్రేమ, దయ, ఐక్యమత్యం సందేశాన్ని ప్రతి ఒక్కరూ ఆచరించాలని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు.మంగళవారం పెదపాడు మండలం పునుకొల్లు సిఎస్ఐ చర్చి ఆవరణలో నాయుడుగూడెం ప్యారిస్ గురువులు రెవ జి.సాల్మన్‌రాజ్ ఆధ్వర్యంలో క్రిస్మస్ ఆరాధనలో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, పునుకొల్లు పోల్ సీఎస్ఐ సంఘస్తులతో కలిసి సెమీక్రిస్మస్ ఆరాధన కార్యక్రమంలో పాల్గొని క్రిస్మస్ కేకును చింతమనేని ప్రభాకర్ కట్ చేశారు.అనంతరం బాలబాలికలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు .రైతులు, విద్యార్థులు, యువత అందరి కోసం ప్రత్యేక ప్రార్థనలను రెవ పాస్టర్లు స్టీఫెన్‌రాక్, సాల్మన్‌రాజ్ ప్రార్థనలు చేశారు. దైవజనులు స్థానిక పాస్టర్ పొలిమెట్ల బాబురావు చింతమనేనిని ఘనంగా సన్మానించారు.

సమస్యలపై అప్రమత్తగా ఉండాలి: డీఎస్పీ

ఏలూరు క్రైం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఆధునిక సమాజంలో యువత ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ సూచించారు. ఏలూరు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు అవగాహన సదస్సును మంగళవారం ఏర్పాటు చేయగా ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా రక్షణ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఎలాంటి ఇబ్బందులను ఎదురైనా వెంటనే పోలీసులను లేదా హెల్ప్‌లైన్ సెంటర్లను సంప్రదించాలన్నారు. మానవత్వంతో ప్రతి ఒక్కరికి సహాయ సహకారులు అందించాలని, పేద వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని డీఎస్పీ శ్రావణ్‌కుమార్ పిలుపునిచ్చారు. భవిష్యత్తులో నిబద్ధత గల వైద్యులుగా సేవ చేయాలని సూచించారు. ఆన్‌లైన్ మోసాలు, సైబర్ బెదిరింపుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సోషల్ మీడియా వినియోగంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, అపరిచిత వ్యక్తులతో వ్యక్తి గత సమాచారాన్ని పంచుకోవద్దని సూచించారు. ఈస మావేశంలో ఏలూరు టూటౌన్ పోలీసులు పాల్గొన్నారు.

వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్‌కు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాజీనామా

ఏలూరు అర్బన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పార్టీలోనూ, సంఘంలోనూ రెడ్డి సామాజికవర్గ ప్రాబల్యాన్ని నిరసిస్తూ వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పదవికి రాజీనామా చేసినట్టు గెడ్డం సుధీర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు మంగళవారంరాత్రి విడుదలచేసిన మీడియా ప్రకటనలో ఆయన తన రాజీనామాకు కారణాలను వివరించారు. పార్టీలోనూ, యూనియన్‌లోనూ రెడ్డిల కుతప్ప ఇతర కులాలవారిని గౌరవించడంలేదని ఆరోపించారు. సంఘ రాష్ట్ర నాయకునిగా జిల్లాలు తిరుగుతూ, భార్యాబిడ్డలను పక్కనపెట్టి సంఘ బలోపేతం కోసం 2011నుంచి పనిచేస్తున్నా ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నానని ఆవేదన వ్యక్తం చేశారు. కొద్దిరోజుల్లోనే దెందులూరు, ఏలూరు ఎమ్మెల్యేలను కలుస్తానని, టీడీపీలో చేరనున్నట్టు వెల్లడించారు.

రెండో రోజుకు చేరిన ఆర్టీసీ రిలే దీక్షలు

ఏలూరు,నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో నలుగురు ఉద్యోగులను అక్రమంగా సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ వివిధ యూనియన్ల నాయకులు ఆధ్వర్యంలో ఏలూరు డిపో కార్యాలయం వద్ద రెండో రోజూ రిలే నిరాహారదీక్ష కొనసాగింది. ఇందులో జేఏసీ తరఫున ప్రసాద్, బాబు, జయరామ్, నారాయణ, బబూరావు, అంజలికుమారి, ఎన్ రాజు, ఎం నాగమణి, పి నీలిమ, పీవీఎస్ఎన్ కుమారిలు దీక్షలో కూర్చున్నారు. ఏలూరు బంకులో జరిగిన 83లక్షల అవకతవకలకు సంబంధించి తప్పు చెయ్యని వారిని విధుల నుంచి తొలగించిన వారికి న్యాయం చేయాలని విజయవాడ ఆర్టీసీ రీజనల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడుకు నాయకులను కలిసి వినతిపత్రం సమర్పించారు.

అవినీతిపై సమగ్ర విచారణ చేయాలి: పీడీఎఫ్ ఎమ్మెల్సీ గోపీమూర్తి

ఏలూరు ఆర్టీసీ బంకులో జరిగిన అవినీతిపై ప్రాథమిక విచారణ జరిపించగా 83లక్షలు స్కామ్ జరిగినట్లుగా నిర్ధారణ అయినట్లు తెల్సిందని, దీనిపై అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి సమగ్ర విచారణ చేయాలని పీడీఎఫ్ ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి డిమాండ్ చేశారు. వెంటనే అవకతవకలకు బాధ్యులైన వారిని గుర్తించాలన్నారు. ఆ సొమ్మును రికవరి చేయాలని, తదనంతరం శిక్షించాలన్నారు.

ధాన్యం ఎగుమతికి సంచుల కొరత

తుఫాన్ భయంతో రైతుల్లో ఆందోళన

పట్టీపట్టనట్టు వ్యవహరిస్తున్న అధికారులు



ధాన్యాన్ని ఆరబెట్టుకున్న రైతులు

చింతలపూడి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): తుఫాన్ హెచ్చరికలు రైతులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. వరి పొలాలు మాసూళ్లకు సిద్ధంగా ఉన్నప్పటికీ ధాన్యం తరలించడానికి సంచుల కొరత రైతులను వేధిస్తోంది. చింతలపూడి వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన రైతు సేవా కేంద్రంలో మూడ్రోజులుగా సంచుల కొరత ఏర్పడింది.యార్డులోని ప్లాట్ ఫారంపైనే రైతులు ధాన్యం ఆరబెడుతూ కాలం వెళ్లదీస్తున్నారు. సకాలంలో సంచులు అందించాల్సిన మండల పౌర సరఫరాల అధికారులకు సమాచారమిచ్చినా మంగళవారం నాటికి ఒక్క సంచి కూడా రాలేదు. అధికారుల పట్టించుకోకపోవడంతో రైతుల్లో ఆందోళన కలిగిస్తోంది. కొనుగోలు కేంద్రం నుంచి సంచులు లేక రైతులు అడిగి తిరుగుముఖం పడుతున్నారు. ఇదిగో సాయంత్రానికి వస్తాయంటూ అధికారులు చెబుతున్నారు. మండలంలో ఈ ఏడాది 12 వేల ఎకరాలకుపైగా వరి సాగు చేశారు. ప్రస్తుతం చాలా వరకు కోత దశకు వచ్చాయి. వరి కోత యంత్రాలు ఎకరాకు రూ.2 వేల 500 నుంచి రూ.3 వేల 200 వరకు వసూలు చేస్తున్నారు.ఇప్పటి వరకు ఆరువేల టన్నులు ఎగుమతి చేశారు. మండలంలో 30వేల టన్నులు లక్ష్యంకాగా సంచులు ఎనిమిది లక్షల వరకు అవసరం ఉంటాయి. ఇప్పటి వరకు 2 లక్షల 60 వేల సంచులు మాత్రమే వచ్చాయి. పౌర సరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ ధాన్యం కొనుగోలును ఇక్కడి నుంచి ప్రారంభించి సంచుల కొరతలేదని ప్రకటించారు. కాగా మండలంలో 14 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. కేవలం చింతలపూడి కొనుగోలు కేంద్రంలోనే ఈ సంచుల కొరత ఉంది. ఈ కొరతపై మండల పౌర సరఫరాల అధికారి దృష్టికి తెచ్చారు. జిల్లా అధికారులకు కూడా ఈ కొరతపై చెబుతున్నా సంచులు రాలేదు. చింతలపూడి కొనుగోలు కేంద్రం నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్న సొసైటీ కార్యదర్శి బాలకృష్ణను ప్రశ్నించగా నాలుగు రోజుల నుంచే ఈ సంచుల కొరత ఉందని, అధికారుల దృష్టిలో పెట్టామని చెప్పారు.

కార్పొరేట్ల కోసమే విత్తన చట్టం

ఏలూరుటూటౌన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): బడా కార్పొరేట్ల లాభాల కోసమే కేంద్ర ప్రభుత్వం విత్తన చట్టాలు తీసుకొచ్చిందని ఏపీ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నేభవన్‌లో కేంద్ర విత్తన చట్టం ముసాయిదాపై సమావేశం జరిగింది. కార్పొరేట్ సంస్థలకు రైతుల నుంచి వేలకోట్లు కట్టబెట్టేందుకే అంటూ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ చట్టంలో కేంద్ర విత్తన కమిటీ చైర్మన్‌తో సహా 27మందిని ఎన్నుకోవాలన్నారు. మెజారిటీ కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా ఉన్నవారే ఎక్కువగా ఉన్నారన్నారు. నూతన విత్తన చట్టం ద్వారా రైతులకు రక్షణ కల్పించాలన్నారు.

క్రీడల్లో మహిళలు రాణించాలి

ఏపీ స్పోర్ట్స్ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి

పోలవరం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): క్రీడారంగంలో మహిళలు రాణించడం హర్షనీయమని ఏపీ స్పోర్ట్స్ అథార్టీ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి అన్నారు. మంగళవారం చేగొండపల్లిలో తన నివాసం వద్ద మాట్లాడుతూ భారత మహిళల కబడ్డీ జట్టు ప్రపంచ కప్ సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రెండవ సారి విశ్వవిజేతగా నిలిచిన భారత్ మహిళా కబడ్డీ జట్టుకు అభినందనలు తెలిపారు. భారతీయ మహిళా క్రీడాకారిణులు వరుసగా సాధిస్తున్న విజయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

అసోసియేట్ ప్రొఫెసర్ బదిలీ

ఏలూరు క్రైం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఏలూరు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఇఎన్‌టి విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ చిలుకూరి అనితను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. డాక్టర్ అనితను విజయవాడలోని సిద్ధార్థ మెడికల్ కాలేజీకి బదిలీ చేశారు.



చెక్కు అందజేస్తున్న సంఘ నాయకులు

ముస్లింల సంక్షేమానికి సీఎం కృషి

ఏలూరు రూరల్, నవంబరు 25, (ఆంధ్రజ్యోతి) : ముస్లింల సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని పలువురు ముస్లిం సంఘాల నాయకులు ప్రశంసించారు.ఏలూరు రైల్వే గేటు మసీదుకు ఇమామ్, మౌజాన్‌లకు 12 నెలలు గ్రాంట్ సుమారు లక్షా 80 వేలు విడుదల చేయగా మసీదు సభ్యులకు అందజేశారు.మసీదు అధ్యక్షుడు ఎండీ సులేమాన్, కార్యదర్శి ఎండీ అంజద్, రాజా అహ్మద్ మాట్లాడుతూ ముస్లిం సంక్షేమానికి చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. ఎండీ ఇక్బాల్, ముతవల్లి, ఎండీ సర్దార్, షేక్ జహంగీర్, ఎండీ అజ్మన్, షేక్ ఖాదర్, అబ్దుల్ రవూఫ్, ఎండీ కమల్ పాల్గొన్నారు.

క్రమశిక్షణ ముఖ్యం: ఏఎస్పీ

ఏలూరు క్రైం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు క్రమ శిక్షణ నేర్చుకోవాలని ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు అన్నారు. ఏలూరు సిఆర్‌ఆర్ మహిళా కాలేజీ విద్యార్థినులకు శక్తియాప్, భవిష్యత్తుపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు.ఈసందర్భంగా ఏఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు మాట్లాడుతూ విద్యార్థినులు కష్టపడి చదవడం ద్వారా మాత్రమే మంచి ఫలితాలు సాధించి మెరుగైన భవిష్యత్తు పొందగలరని సూచించారు. ప్రతి విద్యార్థి తమ తల్లి దండ్రుల ఫోనుల్లో ఈ యాప్‌ను తప్పనిసరిగా ఇన్‌స్టాల్ చేసుకోవాలన్నారు. తక్షణ పోలీస్ సహాయం కోసం డయల్ 112కు కాల్ చేయాలని, మహిళా హెల్ప్‌లైన్ 181కు కాల్ చేయాలన్నారు. ఏలూరు జిల్లా శక్తియాప్ నెంబర్ 79934 85111ను వినియోగించుకోవాలని సూచించారు. అలాగే సైబర్ నేరగాళ్లు ఏపీకె, ఫిషింగ్ ఫైల్స్ ద్వారా ఫోన్‌లోని డేటాను తస్కరించి ఆపై అకౌంట్లో సొమ్ములను స్వాహా చేస్తున్నారని అప్రమత్తంగా ఉండాలన్నారు. త్రి టౌన్ సీఐ వి.కోటేశ్వరరావు, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం సుబ్బారావు, మహిళా ఎస్ఐ నాగమణి, సీఆర్‌ఆర్ కాలేజీ అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

షష్ఠి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

చింతలపూడి/ దెందులూరు /జీలుగుమిల్లి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): చింతలపూడి నగర పంచాయతీ నాగిరెడ్డిగూడెంలోని వల్లీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం బుధవారం నిర్వహించే షష్ఠి కల్యాణ మహోత్సవాలకు ముస్తాబైంది. ఉదయం 11.29 గంటలకు కల్యాణోత్సవం జరుగుతుందని తెలిపారు. పెదపాడు మండలంలోని కొత్తముపర్రు గ్రామంలో షష్ఠి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త అమర్‌శ్రీ తెలిపారు. 27న రమాసహిత సత్యనారాయణ వ్రతం నిర్వహిస్తామన్నారు. జీలుగుమిల్లిలోని సబ్రమణ్యస్వామి ఆలయంలో షష్ఠి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు అర్చకులు టిఎస్.రామకృష్ణశర్మ, సర్వేశ్వరశర్మలు తెలిపారు. ఇటీవల సుబ్రమణ్య స్వామి ఆలయం ఎన్‌హెచ్ రోడ్డు విస్తరణలో తొలగించడంతో గ్రామంలోని శ్రీకోదండ రామాలయంలో ఉత్సవాలు జరుపుతున్నారు.



అభినందిస్తున్న బొరగం శ్రీనివాస్

టీడీపీ మండలాధ్యక్షుడికి అభినందన

పోలవరం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): టీడీపీ మండలాధ్యక్షుడిగా మంగినకొండ మంగళవారం ఎన్నికయ్యారు. ఏలూరు జిల్లాలో పోలవరం నియోజకవర్గంలో 5 మండలాల అధ్యక్షులను టీడీపీ ప్రకటించింది. పార్టీ మండలాధ్యక్షుడిగా మంగిన కొండ ఎంపికవడం పట్ల టీడీపీ మండల నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు ఆయన నివాసం వద్ద మంగిన కొండను పూలబొకేలతో అభినందించారు. నీటి సంఘం మండలాధ్యక్షులు పాదం ప్రసాద్, ఎస్సీ సెల్ నాయకులు యడ్ల వినోద్, టీడీపీ సీనియర్ నాయకులు నల్లా రాంబాబు, ఆకుల రాజా తెలిపారు.

ఫ్రీజర్ బాక్స్ బహూకరణ

టి.నరసాపురం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి):మక్కినవారిగూడెం పంచాయతీకి ఫ్రీజర్ బాక్స్ బహూకరించడం అభినందనీయమని సర్పంచ్ ఎం.గోపాలరావు తెలిపారు. మక్కినవారిగూడెం క్రికెట్ అసోసియేషన్(ఎంసీఏ) ఆధ్వర్యంలో సీతంపేట గ్రామానికి చెందిన వేంపాటి అచ్యుతరావు, భార్య కృష్ణకుమారి దంపతుల సహకారంతో కృష్ణకుమారి తల్లిదండ్రులు బత్తుల లక్ష్మీనారాయణ, నాగ శిరోమణి జ్ఞాపకార్థం ఫ్రీజర్ బాక్సు పంచాయతీకి మంగళవారం బహూకరించారు. కార్యదర్శి కె.పద్మశ్రీ, వీఆర్వో వరప్రసాద్, ఎంసీఏ అధ్యక్షులు డి.సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్ వద్ద ధర్నాలు

ఏలూరు రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ వద్ద బుధవారం జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం ఏలూరు మార్కెట్ యార్డ్ అమాలి వర్కర్స్ యూనియన్ లెమన్ సెక్షన్ కమిటీ సమావేశం యూనియన్ కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. యూనియన్ గౌరవాధ్యక్షులు రెడ్డి అప్పలనాయుడు, బుద్దా వెంకటరావు హాజరై మాట్లాడుతూ కార్మికులను నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వ విధానాలపై పోరాడాలన్నారు. అలాగే రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలంటూ కలెక్టరేట్ వద్ద బుధవారం ధర్నా చేస్తున్నట్టు రైతు కూలీ సంఘం కార్యదర్శి బాషా తెలిపారు. విత్తన చట్టం ముసాయిదాను రద్దు చేయాల డిమాండ్ చేశారు. భారత రైతాంగానికి నష్టం కలిగించే స్వేచ్ఛాయుత వాణిజ్య ఒప్పందం ఎఫ్‌టీఏ రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

సీపీఎం నేత దువ్వాడ దుర్యోధన మృతి

ఏలూరు రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): దువ్వాడ దుర్యోదన(70) సోమవారం రాత్రి ఏలూరులో ఆయన నివాసంలో ఆకస్మికంగా మృతి చెందారు. దుర్యోధన జూట్ మిల్లు కార్మిక నాయకుడిగా సీపీఎం ఉద్యమాల్లో చురుకుగా పాల్గొనేవారు. సీపీ ఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డీఎన్‌వీడీ ప్రసాద్ ఆయన భౌతికకా యంపై సీపీఎం పతకాన్ని కప్పగా సీపీఎం నగర కార్యదర్శి పంపన రవికుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు.

'ప్రపంచంలో అత్యున్నత రాజ్యాంగం మనదే'

ఏలూరుటూటౌన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే భారతరాజ్యాంగం అత్యున్నతమైందని ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ అన్నారు. నవంబరు 26 భారతరాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. దేశ చరిత్రలోనే 1950 జనవరి 26 ఒక మైలు రాయని అన్నారు. రాజ్యాంగ కమిటీ అధ్యక్షుడిగా డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ గుర్తు చేసుకోవల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ రాజ్యాంగాన్ని అనుసరిస్తూ బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని అన్నారు.

ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాం: చంటి

ఏలూరుటూటౌన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 17నెలల కాలంలోనే ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చామని ఎమ్మెల్యే చంటి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మిగిలిన సమస్యలు త్వరలోనే పరిష్కరించాలన్నారు. రైతులకు రెండు విడతల్లో రూ.14 వేలు జమ చేశామన్నారు. 2029 నాటికి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఇడా ఛైర్మన్ శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభా పాఠశాలలో ఆరెంజ్ డే

జంగారెడ్డిగూడెం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రతిభ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో అంతర్జాతీయ స్త్రీ హింసా వ్యతిరేక దినం కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ కాసర సరో జారెడ్డి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు.ప్రతీ సంవత్సరం ఇదే రోజును ఆరెంజ్ డేగా ఘనంగా జరుపుతున్నట్టు సరోజా రెడ్డి తెలిపారు. విద్యార్థినులు ఆరెంజ్ కలర్ దుస్తులు ధరించి తమలోని చైతన్యాన్ని చాటిచెప్పారు. పాఠశాల డైరెక్టర్ సింధూషా రెడ్డి పాల్గొన్నారు.

కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

జంగారెడ్డిగూడెం,నవంబరు 25(ఆంధ్రజ్యోతి): సంక్షేమ బోర్డును వెంటనే పునరుద్ధరించాలని ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర కార్మిక శాఖ కార్యదర్శి ఎం.వి.శేషగిరిబాబుకు వినతిపత్రం సమర్పించినట్లు ఆ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.రమణ తెలిపారు. మంగళవారం విజయవాడలోని కార్మికశాఖ కార్యాలయంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పలు భవన నిర్మాణ కార్మిక సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించినట్టు కె.వి.రమణ తెలిపారు. సమావేశంలో కార్మిక శాఖ రాష్ట్ర కార్యదర్శి ఎం.వి.శేషగిరిబాబు, కార్మిక శాఖ అదనపు కార్యదర్శి గంధం చంద్రుడు, కార్మిక శాఖ సంక్షేమ బోర్డు చైర్మన్ వలవల మల్లి ఖార్జునరావు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే పోరాటం

వేలేరుపాడు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసమే సీపీఐ పోరాడుతోందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో మండల కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో కృష్ణ చైతన్య మాట్లాడారు. భారత కమ్యూనిస్టు పార్టీ వెనుతిరగని పోరాటాలతో పేదలకు అండగా ఉంటూ వందేళ్ల పూర్తి చేసుకోవడం గర్వించదగ్గ విషయమన్నారు. బడుగు, బలహీనవర్గాలతో పాటు కార్మికులు రైతుల సమస్యలపై సీపీఐ పోరాటాలు కొనసాగిస్తుందని తెలిపారు. డిసెంబరు 26న ఖమ్మంలో నిర్వహించే జాతీయ స్థాయి శత జయంతి వేడుకల్లో పాల్గొనేందుకు తరలివెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. సీపీఐ సీనియర్ నాయకులు ఎండీ మున్నీర్, రాష్ట్ర సమితి సభ్యులు కారం దారయ్య, మండల కార్యదర్శి బాడిసరాము, బంధం రమాదేవి, పిట్టా ప్రసాద్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నేత్రదానంతో ఇద్దరికి చూపు



వెంకటేశ్(ఫైల్)

ఏలూరు రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మనిషి జీవితం క్షణి కమే అయినా.. మనం చేసే కొన్ని సేవలు, త్యాగాలు మరణాంతరం కూడా సమాజానికి వెలుగునిస్తాయి. అలాంటి మహత్తరమైన సేవలో నేత్రదానం ఒకటి. ఏలూరు అగ్రహారానికి చెందిన బి.వెంకటేశ్(45) సోమవారం రాత్రి మృతి చెందారు. మరణాంతరం ఆమె కుటుంబం తీసుకున్న నిర్ణయం ఎంతో గొప్పదన్నారు. ఆయన నేత్రాలను దానం చేసి మరో ఇద్దరికి కొత్త చూపునిచ్చారు. నేత్రదానంపై లయన్స్ క్లబ్ డీసీ మానేపల్లి రామా రావుకు తెలియజేయడంతో ఎల్వీ ప్రసాద్ హాస్పిటల్ ఆధ్వర్యంలో వెంకటేష్ భౌతికకాయం నుంచి కార్నియాలు సేకరించారు. నేత్రదానం చేసి అంధత్వాన్ని నివారించాలని, అప్పుడే కంటి చూపు లేని వారికి కంటి వెలుగు వస్తుందని మానేపల్లి రామారావు తెలిపారు.




పల్లకిలో ఊరేగిన సుబ్బారాయుడు

ద్వారకాతిరుమల, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరుడు పల్లకీ వాహనంలో కొలువుదీరి మంగళవారం రాత్రి క్షేత్ర పురవీధుల్లో ఊరేగారు. శ్రీవారి క్షేత్ర ఉపాలయమైన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరుడి ఆలయంలో స్వామివారి కల్యాణ మహోత్సవాలు నేత్రపర్వంగా జరిగాయి. ముందుగా ఉదయం ఆలయంలో నిత్యావపోసన, బలిహరణ, అనంతరం అభిషేకాలు జరిపారు. రాత్రి ఉత్సవ మూర్తులను పలకీ వాహనంలో ఉంచి అలంకరించి పూజలు జరిపి హారతులిచ్చారు.అనంతరం మేళతాళాలు, డోలుసన్నాయి వాయిద్యాల నడుమ క్షేత్ర పురవీధుల్లో ఊరేగారు. ప్రతీ ఇంటి ముంగిట స్వామికి భక్తులు నీరాజనాలు సమర్పించారు. స్వామివారి కల్యాణం బుధవారం రాత్రి 8 గంటల నుంచి ప్రారంభమవుతుందని అధికారులు తెలిపారు.

ఎమ్మెల్యే బాలరాజు జనవాణికి ఫిర్యాదుల వెల్లువ

పోలవరం, నవంబరు25(ఆంధ్రజ్యోతి):స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో మండల జనసేన అధ్యక్షులు గునపర్తి చిన్ని ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అధ్యక్షతన జరిగిన జనవాణిలో మంగళవారం ఫిర్యాదులు పోటెత్తాయి. ఉదయం ప్రారంభమైన జనవాణి కార్యక్రమం మధ్యాహ్నం మూడు గంటల వరకూ కొనసాగింది. మండలంలో అన్ని పంచాయతీల గ్రామాల నుంచి ప్రజలు భారీగా తరలి వచ్చి తమ గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి వినతి పత్రాలు ఎమ్మెల్యేకి అందజేశారు. ఎమ్మెల్యే సమస్యలపై సానుకూలంగా స్పందించి ఫిర్యాదులపై ఆయా శాఖల అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని సూచించారు. 140 వినతులు జనవాణికి అందాయి. వింజరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మెడికల్ క్యాంపును డాక్టర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఏపీ ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు, తహసీల్దారు బి.సాయిరాజు, ఎంపీడీవో సి.హెచ్. శ్రీనివాస్ బాబు, వ్యవసాయాధికారి కె.రాంబాబు, నాయకులు మంగిన కొండ, కొణతాల ప్రసాద్, తెలగంశెట్టి రాము, కాకి అయ్యప్ప, బొరగం వెంకటలక్ష్మి, పాదం ప్రసాద్, మామిడిపల్లి స్వాతి, పొడుం పుష్ప పాల్గొన్నారు.



జనవాణిలో పాల్గొన్న ఎమ్మెల్యే చిర్రి, బొరగం

సమస్యలపై సీపీఎం నాయకుల వినతి..

జనవాణిలో సీపీఎం మండల కమిటీ నాయకులు ప్రజా సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఏజన్సీ గ్రామాల్లో రోడ్లు, శ్మశానవాటికలు, మంచినీరు, వీధి లైట్లు, డ్రైనేజీలు, సీసీ రోడ్లపై వినతిపత్రం అందించి పరిష్కరించాలని కోరారు. మండల కార్యదర్శి కారం భాస్కర్, జిల్లా కమిటీ సభ్యులు గుడెల్లి వెంకట్రావు, తామా ముత్యాలమ్మ, తామా బాలరాజు, మడివి చలపతి, సముద్రాల సాయికృష్ణ, తామా బాలకృష్ణ, రాజు పాల్గొన్నారు.

గ్రావెల్ తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

భీమడోలు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): భీమడోలు మండలం పోలసానపల్లి పోలవరం కుడి కాలువ గట్టుపై గ్రావెల్‌ను లారీలో తీసుకుపోతున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు భీమడోలు పోలీసులు తెలిపారు. ద్వారకాతిరుమల మండలం పంగిడిగూడెం గ్రామానికి చెందిన భూక్య బాలాజీ అనే వ్యక్తి లారీలో గ్రావెల్‌ను ఎత్తుకుపోతుండగా భీమడోలు పోలీసులు అడ్డుకుని లారీని సీజ్ చేసి బాలాజీని అరెస్టు చేసి కేసు నమోదు చేశారు.

పశువులు తరలించే లారీపై కేసు

జీలుగుమిల్లి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న పశువుల లారీపై ఎస్.ఐ. వి.క్రాంతి కుమార్ కేసు నమోదు చేశారు. జాతీయ రహదారిపై వెళ్తుండగా అనుమానంతో వాహనాల్ని తనిఖీ చేస్తుండగా ఓ లారీలో సుమారు 70 పశువుల్ని అక్రమంగా పలాస నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వీటిని తరలించడంపై లారీ డ్రైవర్ క్లీనర్‌లపై ఎస్.ఐ. కేసు నమోదు చేశారు. పశువుల్ని కృష్ణా జిల్లా బాపులపాడు సమీప మడిచర్ల గ్రామంలో భారతీయ జన పరిషత్ గోశాలకు అప్పగించినట్టు ఎస్.ఐ. తెలిపారు.

చట్టాలపై అవగాహన

లింగపాలెం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మహిళలకు చట్టాలపై అవగాహన ఉండాలని పని ప్రదేశాలలో, ఇతర ప్రాంతాలలో ఎవరైనా మహిళలు వేధింపులకు గురి చేస్తే ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చెయ్యాలని మండల లీగల్ సర్వీస్ అథారిటీ కమిటీ సభ్యులు న్యాయవాదులు చైతన్య, ఎన్.ఏసుపాదం, చింతలపూడి సబ్‌యూనిట్ ఆఫీసర్ ప్రసాద్‌లు తెలిపారు. లింగపాలెం మండలం పాశ్చానగరంలో లీగల్ సర్వీస్ అథారిటీ కమిటీ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్త మాణిక్యం, మహిళలు పాల్గొన్నారు.

ఇంటెలిజెన్స్ సవాళ్లపై ఉపన్యాసం

ఏలూరుఅర్బన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ కెరీర్-ఆర్టీఫిషియల్ ఇంటెలిజెన్స్ సవాళ్లు అనే అంశంపై మంగళవారం స్థానిక సీఆర్‌ఆర్ కళాశాలలో అతిథి ఉపన్యాసం జరిగింది. హైదరాబాద్ బిజినెస్ స్కూలు విజిటింగ్ ప్రొఫెసర్ డాక్టర్ వివేక్ రాజశేఖర్ మాట్లాడుతూ ఏఐ ప్రభావంతో వ్యాపార రంగాలు ఎదుర్కొంటున్న సవాళ్లు, వాటి నివారణగురించి వివరించారు. కరస్పాండెంట్లు డాక్టర్ విష్ణుమోహన్, శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ రామరాజు, ఆంజనేయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



ఎంపీడీవోగా నాగేంద్రకుమార్

పెదవేగి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పెదవేగి ఎంపీడీవోగా టి.నాగంద్రకుమార్ విధుల్లో చేరారు. ఎంపీ డీవోగా బాధ్యతలు చేపట్టిన నాగేంద్ర కుమార్‌కు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి, అభినందనలు తెలిపారు. అనంత పురం జిల్లా తాడిమర్రి మండల పరిషత్ కార్యాలయ పరిపాలనాధికారిగా పనిచేస్తూ పదోన్నతిపై పెదవేగి ఎంపీడీవోగా బదిలీపై వచ్చారు. పెదవేగి ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వహించిన కార్యాలయ పరిపాల నాధికారి రవికుమార్, నాగేంద్రకుమార్‌కు బాధ్యతలు అప్పగించారు.

విద్యార్థులకు వాటర్ బాటిల్స్ వితరణ

నూజివీడు టౌన్, నవంబరు 25, (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యకర సమాజానికి ప్లాస్టిక్‌కు దూరంగా ఉండాలని నితిన్ వీరయ్య చౌదరి చారిటబుల్ ట్రస్టు పొట్లూరి అశోక్, పొట్లూరి ఇందిరాలు అన్నారు. మంగళవారం నూజివీడు ఫౌండేషన్ స్కూల్లో విద్యార్థులకు వాటర్ బాటిల్స్‌ను వారు వితరణగా అందించారు. ఈసందర్భంగా ప్లాస్టిక్ బాటిల్స్ వాడటం వల్ల జరుగుతున్న అనర్థాలను వివరించారు. అనంతరం ట్రస్ట్ నిర్వాహకులను ఉపాధ్యాయులు దుశ్శాలువతో సన్మానించారు. ఈకార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెదలంక షష్టి ఉత్సవ కమిటీ నియామకం

కలిదిండి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పెదలంక సుబ్రహ్మణ్య షష్టి ఉత్సవాలకు కమిటీని నియమిస్తూ దేవదాయశాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. కమిటీ సభ్యులుగా దుగ్గిరాల రాము, దుగ్గిరాల రామకృష్ణ, గంగుల రామలక్ష్మీ, సీహెచ్.పుష్ప, డి.లక్ష్మీ కళావతి, గంగుల నాగలక్ష్మి, జి.మాధవి, దండు దేవి నియమితులయ్యారని ఆలయ ఈవో శేఖర్ తెలిపారు.

పేదల సొంతింటి కల సాకారానికి సర్వే



చాట్రాయి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కల సాకారానికి మండలంలోని అన్ని గ్రామాల్లో అధికారులు సర్వే నిర్వహిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) 2.0 కింద అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసి ఇళ్ళు మంజూరు చేయటానికి అవసరమైన చర్యలు చేపట్టింది. అధికారిక లెక్కల ప్రకారం మండలంలో 2645 మంది ఇళ్ళ కోసం దరఖాస్తు చేసుకోగా ఇప్పటి వరకు 1187 ఇళ్ళు సర్వే జరిపి జియో ట్యాగింగ్ చేశారు. ఈ సర్వేకి ఈ నెల 30 వరకు గడువు ఉంది. ఎటువంటి అక్రమాలకు అవకాశం లేకుండా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి అర్హులకు మాత్రమే ఇళ్ళు మంజూరయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులతో పాటు కొత్తగా దరఖాస్తు చేసిన వారిని సర్వేలో నమోదు చేస్తున్నారు. జియో ట్యాగింగ్ చేసిన చోటే ఇళ్ల నిర్మించాల్సి ఉంటుంది. లబ్ధిదారుల వివరాలను పూర్తిగా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. యూనిట్ విలువ ఎంత అనేది ఈ సర్వేలో స్పష్టత లేదు. కూటమి ప్రభుత్వం ఇళ్ళ మంజూరు ప్రక్రియ ప్రారంభించటంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఫిర్యాదుపై సబ్ కలెక్టర్ పొలాల పరిశీలన



ఆగిరిపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆగిరిపల్లి మండలం సగ్గూరు గ్రామానికి చెందిన రైతులు చెరువు వల్ల పంట పొలాలు మునిగిపోతున్నాయని ఫిర్యాదు చేశారు. సదరు సమస్యపై నూజివీడు సబ్ కలెక్టర్ బి వినూత్న మంగళవారం ఆ ప్రాంతానికి వెళ్ళి పంట పొలాలను పరిశీలించారు. ఈ పరిశీలనలో ఆమె వెంట తహసీల్దార్ పిఎన్వీప్రసాద్, ఎస్‌ఐ శుభశేఖర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ యూనస్, రైతులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ప్రమోదిని



ముదినేపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి అండర్-14 కబడ్డీ పోటీలకు ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలం అల్లూరులోని ప్రొఫెసర్ శివరామ్, వాణీ భాయిరామ్ స్మారక జడ్పీ హైస్కూలు ఎనిమిదో తరగతి విద్యార్థిని వి.ప్రమోదిని ఎంపికైంది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల ఉమ్మడి కృష్ణా జిల్లా స్థాయిలో గూడూరులో బాలికల విభాగంలో జరిగిన కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ నెల 24న మచిలీపట్నం నోబుల్ కళాశాలలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-14 బాలికల విభాగంలో బంగారు పతకం సాధించి త్వరలో జరగబోయే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈమెను మంగళవారం హైస్కూలు హెచ్‌ఎం ఎస్.రామోజీ, ఎస్ఎంసీ చైర్మన్ ఎస్.వెంకట శ్యామల, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు దావు నాగరాజు, ఉపాధ్యాయులు, పీఈటీ కె.రాంబాబు, సీఆర్పీ కె.సంగీతరావు అభినందించి సత్కరించారు.

కబడ్డీ పోటీలకు త్రివిధ విద్యార్థి వివేక్ ఎంపిక

నూజివీడు టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు నూజివీడు త్రివిధ పాఠశాల విద్యార్థి నాగళ్ళ వివేక్ ఎంపిక అయినట్లు ప్రిన్సిపాల్ ఎస్. శ్రీనివాస్ తెలిపారు. కర్నూలులో నిర్వహించిన పోటీల్లో కృష్ణాజిల్లా జట్టు తరఫున పాల్గొన్న వివేక్ జాతీయస్థాయి పోటీలకు ఎంపిక అయ్యాడు అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థికి మూడువేల రూపాయిల ప్రోత్సాహక బహుమతిని ఆయన అందించారు. ఈసందర్భంగా విద్యార్థులని పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న న్యాయమూర్తి లక్ష్మి

కైకలూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మహిళల రక్షణ కొరకు రాజ్యాంగ బద్ధంగా అనేకరకాల చట్టాలు న్నాయని వాటిని అవగాహనతో సద్వినియోగం చేసుకోవాలని కైకలూరు సీనియర్ సివిల్ జడ్జి వివిఎన్‌వి లక్ష్మీ అన్నారు. మంగళవారం కైకలూరు బాలికల జిల్లా పరిషత్ హైస్కూల్లో మహిళలపై హింస నిర్మూలన దినోత్సవం సందర్భంగా న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ సమాజంలో మహిళలు ఎక్కడైనా వివక్షకు గురైనా వేధించబడినా అనేకరకమైనటువంటి చట్టాలున్నాయని వాటిన అవగాహనతో సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థి దశ నుండే మహిళల చట్టాలపై బాలికలు అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కె శైలజ, న్యాయవాదులు పి పవన్‌కాంత్, సీహెచ్ జయప్రకాష్, ఏఎస్పై పి పూర్ణచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

'రైతన్నా మీ కోసం'పై అవగాహన కల్పించండి

నూజివీడు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న ప్రయోజనాలపై ప్రతి రైతుకు అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయ అధికారి షేక్ హబీబ్ బాషా అన్నారు. మంగళవారం నూజివీడు మండలం మీర్జాపురంలో రైతన్నా మీ కోసం కార్యక్రమాన్ని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిమాండ్ ఆధారిత వ్యవసాయం, వ్యవసాయ పద్ధతుల్లో సాంకేతికత, ఆహార ప్రాసెసింగ్ ప్రభుత్వ మద్దతు అనే విషయాలపై రైతులకు ఆర్ఎస్‌కే సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. నూజివీడు మండలంలో రైతన్నా మీ కోసం సర్వే 12,723 కుటుంబాలకు గాను ఇప్పటి వరకు 4281 కుటుంబాలకు సంబంధించిన సర్వే పూర్తయిందని మిగిలిన వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్ఎస్‌కే సిబ్బందిని ఆదేశించారు. నూజివీడు సాయిల్ టెస్టింగ్ ల్యాబ్‌ను పరిశీలించారు. వ్యవసాయ అధికారి చెన్నారావు పాల్గొన్నారు.

క్లీన్ అండ్ గ్రీన్‌లో మహిళల పాత్ర కీలకం

ముదినేపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతలో మహిళలదే కీలక పాత్ర అని ముదినేపల్లి ఎంపీడీవో వై.రామకృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో క్లీన్ అండ్ గ్రీన్ అమలులో మహిళల పాత్ర అనే అంశంపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పరిశుభ్రత పట్ల స్వయం సహాయక సంఘాల అధ్యక్షులు, సభ్యులు గ్రామాల్లో మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామస్థాయిలో కూడా పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది, డ్వాక్రా ప్రతినిధులు అవగాహన సదస్సులను నిర్వహించి పరిసరాల పరిశుభ్రత వల్ల కలిగే ప్రయోజనాలను వివరించాలని కోరారు. డిప్యూటీ ఎంపీడీవో బి.అశోక్, మండల పరిషత్ కార్యాలయ ఏవో మేకా వెంకట రమణారావు, వెలుగు, ఏపీఎం కె.శ్రీనివాస్, డ్వాక్రా సీసీ కల్పన, సంఘాల మహిళలు, వీఓలు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475

సరిలేరు.. మాకెవ్వరూ..

ఉత్సాహంగా దివ్యాంగుల క్రీడా పోటీలు



దివ్యాంగుల పరుగు పందెం

ఏలూరు రూరల్, నవంబరు 25, (ఆంధ్రజ్యోతి) : గెలిచే వరకు అలుపు లేదు. గెలుపే మనందరికీ స్ఫూర్తి. ఆ స్ఫూర్తితో దివ్యాంగులు జీవితంలో ముందుకు సాగుతూ వైకల్యాన్ని అధిగమించి ఆత్మవిశ్వాసంతో క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. దివ్యాంగులైతేనేం దేనిలోనూ తగ్గేది లేదని నిరూపించారు. వైకల్యాన్ని అధిగమించి ఉరుకులు పరుగులు పెట్టారు. కంటిచూపు లేకపోయినా విజయలక్ష్యాన్ని నిర్దేశించుకుని తేలిగ్గా చేరుకున్నారు. షాట్‌బాల్‌లో బాలును గురి చూసి విసిరి విజేతలుగా నిలిచారు. అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా విభిన్న ప్రతిభావంతులు వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో దివ్యాంగులకు క్రీడా పోటీలు నిర్వహించారు. దివ్యాంగులు ఉత్సాహంగా పాల్గొని తమలోని ప్రతిభను చూపించారు. క్రీడా పోటీల్లో క్రీడాస్ఫూర్తి, పోటీతత్వం వెల్లివెరిశాయి. ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అంగవైకల్యం ప్రతిభకు అడ్డుకాదన్నారు. దివ్యాంగులను అన్ని రంగాల్లో పోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లావ్యాప్తంగా సుమారు 500 మంది దివ్యాంగ క్రీడాకారులు హాజరయ్యారు. విజేతలకు డిసెంబరు 3వ తేదీన ఏలూరులో జరిగే కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పతకాలు అందజేస్తారు. ఈకార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మామిళ్ళపల్లి పార్థసారథి, యూడా చైర్మన్, డీఎస్‌డీవోఎస్ఏ అజీజ్, విభిన్న ప్రతిభావంతులశాఖ ఏడీ బి రామ్‌కుమార్, యుగంధర్, పీఈటీలు పాల్గొన్నారు.

రహదారులను బాగు చేయండి

- జడ్పీ సర్వసభ్య సమావేశంలో గళమెత్తిన జడ్పీటీసీలు
- ధాన్యం సేకరణలో ఇబ్బందులు రానివ్వద్దన్న జడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ
- రైతుల సమస్యలు తెలుసుకుంటున్నామన్న కలెక్టర్ వెట్రి సెల్వి



జడ్పీ సమావేశంలో మాట్లాడుతున్న పద్మశ్రీ

ఏలూరులోని జడ్పీ సమావేశ మందిరంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీప్రసాద్ అధ్యక్షతన మంగళవారం జరిగిన జడ్పీ సర్వసభ్య సమావేశం జరిగింది. జిల్లాలో రహదారుల దుస్థితిపై ప్రధానంగా జడ్పీటీసీలు ప్రస్తావించారు.

ఏలూరు సిటీ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ధాన్యం సేకరణలో రైతుల సమస్యలను ముందుగానే గుర్తించి పరిష్కరించాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అధికారులను ఆదేశించారు. ప్రస్తుత వ్యవసాయ సీజన్‌లో రికార్డు స్థాయిలో 4.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా నిర్ధేశించారని, ధాన్యం సేకరించిన గంటల వ్యవధిలోనే రైతులకు ధాన్యం సొమ్ము ప్రభుత్వం జమచేస్తోందన్నారు. సాగులో యాంత్రీకరణను ప్రోత్సహిస్తున్నామని, జిల్లాలో ఇప్పటికే 51 డ్రోన్స్ రైతులకు అందించామన్నారు. రైతులకు నాణ్యమైన గోనె సంచులు అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. 10వ తరగతిలో జిల్లాను రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిపేలా చర్యలు తీసుకోవాలని, రహదారులపై గుంతలు లేకుండా చూడాలని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు.

●ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ జల్‌జీవన్ మిషన్ పథకం కింద చేపట్టిన పనులు నిర్ధేశించిన సమయంలోగా పూర్తి చేయాలని, గుంతలు లేని రహదారులు ఉండేలా ఆర్అండ్‌బీ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పీహెచ్‌సీ భవనాలు పూర్తి చేయాలన్నారు.

● జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి మాట్లాడుతూ రైతన్నా.. మీకోసం కార్యక్రమం ద్వారా ప్రతి రైతు ఇంటికెళ్ళి వ్యవసాయంలో వారు ఎదుర్కొనే సమస్యలు, అభిప్రాయాలను యాప్‌లో వ్యవసాయ అధికారులు పొందుపరుస్తున్నారన్నారు.

● ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలో మౌలిక సదుపాయాలపై విద్యాశాఖాధికారులు పర్యవేక్షణ ఉండాలన్నారు. తణుకు వద్ద పశుమాంస కబేళాలు నిర్వహిస్తున్నారని, పర్యావరణానికి ముప్పు కలగటమే గాక ప్రజలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని, సమస్య పరిష్కరించాలన్నారు.

● గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు మాట్లాడుతూ జడ్పీ నిధుల మంజూరులో అధిక జనాభా కలిగిన గోపాలపురం నియోజకవర్గానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా నీట మునిగిన పంటలకు నష్టం కలుగకుండా తీసుకోవాల్సిన చర్యలపై వ్యవసాయ శాస్త్రవేత్తలతో రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రైతుల సంక్షేమంలో ప్రతిపక్ష సభ్యులు రాజకీయం చేయవద్దన్నారు. సమావేశంలో జిల్లా పరిషత్ సీఈఓ ఎం. శ్రీహరి, పశ్చిమగోదావరి జిల్లా డీఆర్‌వో బి శివనారాయణ రెడ్డి, కొవ్వూరు ఆర్డీఓ రాణి సుస్మిత, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలకు చెందిన వివిధ శాఖల అధికారులు, జడ్పీటీసీలు, ఎంపీపీలు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

నూజివీడు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక స్వావలంబన సాధించిన రోజున మహిళలు తమపై జరుగుతున్న హింసను ఎదుర్కోగలరని సీనియర్ న్యాయవాది నండూరి పద్మాంజలి అన్నారు. నూజివీడు మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె గృహ హింస రక్షణ చట్టం, విద్య శాస్త్రీయ ఆలోచన, ఆత్మనిర్భర ఆర్థిక స్వయం శక్తి తదితర అంశాలను వివరించారు. నూజివీడు సీడీపీవో పి. విజయకుమారి, సీనియర్ న్యాయవాది దార్లకుమారి తదితరులు పాల్గొన్నారు.

పీఎం కిసాన్‌పై ఇంటింటి ప్రచారం

చాట్రాయి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పీఎం కిసాన్ పథకంపై చనుబండ బీసీ కాలనీలో మంగళవారం బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా నాయకుడు బుర్రి శ్రీకర్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం రైతుకు అండగా ఉండాలనే లక్ష్యంలో ఏడాదికి రూ. 6 వేలు ప్రతి రైతు బ్యాంకు ఖాతాలో జమ చేస్తోందని, దీనిని అందరూ సద్వినియోగం చేసుకొని అభివృద్ధి సాధించాలని కోరారు. సాంకేతిక కారణాలతో సొమ్ము రాని రైతులు వెంటనే రైతుసేవా కేంద్రాలకు వెళ్ళి సరైనా పత్రాలు సమర్పించి ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు. మాజీ ఎంపీపీ కందుల కృష్ణ, వీఏఏ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

మాలధారులకు అన్నదానం

ముదినేపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం రంగాపురంలోని శ్రీషిర్డిసాయిబాబా మందిరం వద్ద మంగళవారం అయ్యప్ప, భవానీ మాలధారులకు బీజేపీ ఏలూరు జిల్లా కో కన్వీనర్ కోటప్రోలు కృష్ణారావు అన్నదానం నిర్వహించారు. తన పుట్టిన రోజును పురస్కరించుకుని ఆయన అయ్యప్పకు, సాయిబాబాకు పూజలు జరిపి గురుస్వామి వేల్పూరి నానాజీ ఆధ్వర్యంలో సుమారు 300 మంది మాలధారులకు అన్నదానం చేశారు. మండల టీడీపీ ఉపాధ్యక్షుడు యర్రా రాంబాబు, ప్రెస్ క్లబ్ మండల అధ్యక్షుడు చిలకలపల్లి నాగరాజు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

స్వచ్ఛతపై అడుగులు వేయండి

మండవల్లి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): గ్రామాలను స్వచ్ఛత, పచ్చదనం పరిశుభ్రత వైపు అడుగులు వేసేలా సర్పంచ్‌లు, అధికారులు బాధ్యతలు తీసుకోవాలని ఎంపీడీవో రమణబాబు తెలిపారు. మండవల్లి వెలుగు కార్యాలయంలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంలో భాగంగా సర్పంచ్‌లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

రైతు అభివృద్ధితోనే రాష్ట్రాభివృద్ధి



వింజరంలో రైతన్నా.. మీ కోసం

కైకలూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రైతు ఆర్థికంగా అభివృద్ధి చెందితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని నియోజకవర్గ టీడీపీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు అన్నారు. మంగళవారం వింజరంలో రైతన్న మీకోసంలో భాగంగా ఇంటింటికి వెళ్లి అన్నదాత సుఖీభవ కరపత్రాలను పంపిణీ చేశారు. రైతులకు రెండో విడత ఖాతాల్లోకి నగదు జమ చేసినందున వచ్చే నెల 3వ తేదీ వరకు రైతన్న మీకోసం వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పంచసూత్రాలపై రైతులకు అవగాహన కల్పించారు. రాష్ట్ర ఆర్యవైశ్య కార్పోరేషన్ డైరెక్టర్ మాల్యాద్రి, మండల టీడీపీ అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు, క్లస్టర్ ఇన్‌చార్జి లక్ష్మీరాణి, మండల ప్రధాన కార్యదర్శి పి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముసునూరు: రైతుల శ్రేయస్సే కూటమి ప్రభుత్వ ధ్యేయమని సర్పంచ్ గద్దల సుహాసిని మోహన్‌రావు, వేంపాడు మేజర్ డీసీ చైర్మన్ రాపర్ల బాలకృష్ణ అన్నారు. మంగళవారం కాట్రేనిపాడు సొసైటీలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించారు. అనంతరం కొనుగోలు చేసిన తొలి ధాన్యం లోడ్‌కు పచ్చజెండా ఊపి రైస్‌మిల్లుకు తరలించి మాట్లాడుతూ పంటకు మద్దతు ధర కల్పించేందుకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందన్నారు. ఈ కేంద్రాల్లో రైతులు తమ ధాన్యాన్ని విక్రయించి ఆర్థికంగా లాభం పొందాలని కోరారు. ధాన్యం విక్రయించిన 24గంటల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ అవుతుందన్నారు. ఎంపీటీసీ సూర్యదేవర నాగమంజుల శ్రీనివాసరావు, నాయకులు గూడపాటి అజయ్‌కుమార్, బడిపాటి సాంబశివరావు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల ప్రయోజనాలు కాపాడేది కూటమి ప్రభుత్వమే: కాపా

నూజివీడు టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రైతులకు అత్యధిక ప్రయోజనాలు అందిస్తున్నది కూటమి ప్రభుత్వమేనని నూజివీడు ఏఎంసీ మాజీ చైర్మన్, రావిచర్ల సర్పంచ్ కాపా శ్రీనివాస్‌రావు అన్నారు. నూజివీడు మండలం రావిచెర్లలో రైతన్నా మీ కోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం రైతులకు కల్పిస్తున్న ప్రయోజనాలను ఆయన వివరించారు. ఎంపీటీసీ మరీదు శివ నాగమణి, మాజీ ఎంపీటీసీలు వై సాంబశివరావు, ఎం చెన్నకేశవరావు, రైతులు, ఆర్ఎస్కే సిబ్బంది పాల్గొన్నారు.

పెండ్లి కుమారుడైన సుబ్రహ్మణ్యేశ్వరుడు

ముదినేపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం సింగరాయపాలెం - చేవూరు పాలెం సెంటర్‌లోని ప్రసిద్ధ శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో వార్షిక షష్టి కల్యాణోత్సవాలకు శ్రీకారం చుట్టారు. మంగళవారం స్వామిని, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలుగా అలంకరించి పూజలు చేసిన అనంతరం అర్చకుడు తోలేటి వీరభద్ర శర్మ పూజలు చేశారు. బుధవారం రాత్రి ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో స్వామి వారి కల్యాణానికి పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. పుట్టలో పాలు పోసేందుకు భక్తులు క్యూ పద్ధతిని పాటించి సహకరించాలని ఏసీ గంగా శ్రీదేవి కోరారు. ఉత్సవ కమిటీ సభ్యులతో ఆమె సమావేశాన్ని నిర్వహించి షష్టి మహోత్సవాలను విజయవంతం చేసేందుకు దేవదాయశాఖ అధికారులు, కమిటీ సమన్వయంతో కృషి చేయాలని కోరారు.



స్వామివారికి పెండ్లి కుమారుడి అలంకరణ



ఎంపికైన షష్టి ఉత్సవ కమిటీ

షష్టి ఉత్సవాల్లో అప్రమత్తత అవసరం : సీఐ

షష్టి కల్యాణోత్సవాల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించాలని కైకలూరు రూరల్ సీఐ రవికుమార్ తెలిపారు. మంగళవారం ఆయన ఆలయ ప్రాంగణంలో ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. బుధ వారం పుట్టలో పాలు పోసే సమయంలో తొక్కిసలాట జరగకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని పోలీసులకు, వలంటీర్లుగా పనిచేసేందుకు వచ్చిన విద్యార్థులకు సూచనలిచ్చారు. దొంగల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ముదినేపల్లి, మండవల్లి ఎస్‌ఐలు వీరభద్రరావు, రామచంద్రరావు, కైకలూరు ఎస్‌ఐ రాంబాబు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

క్రైమ్ సమాచారం

సహజీవనం చేస్తున్న మహిళపై కత్తితో దాడి



మహిళ చేతి వేళ్ళు మధ్యలో తెగిన దృశ్యం

కైకలూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో సహజీవనం చేస్తున్న మహిళపై కత్తితో దాడి చేసిన ఘటన కైకలూరులో సంచలనం కలిగించింది. పోలీసుల కథనం ప్రకారం బాధితురాలు 15 ఏళ్ల క్రితం భర్త నుంచి దూరమై కైకలూరు మండలం సీతనపల్లిలో కుమార్తెతో కలిసి ఉంటోంది. అదే గ్రామానికి చెందిన ఏసోబుతో పరిచయం ఏర్పడి అతనితో సహజీవనం చేస్తోంది. అయితే 6 నెలలుగా ఏసోబుకు బాధితురాలికి డబ్బుల విషయమై గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆమె కైకలూరులోని ఇస్లాంపేట వద్ద ఆమె బంధువుల ఇంటిలో కుమార్తెతో కలిసి కొద్దిరోజులు ఉంది. అనంతరం కుమార్తెను బంధువుల ఇంటి వద్ద ఉంచి విజయవాడలో పనులు చేసుకునేందుకు బాధితురాలు వెళ్లింది. ఈ నెల 24న తిరిగి కైకలూరు వచ్చింది. ఏసోబు గత నాలుగు రోజులుగా కైకలూరులోని బాధితురాలి బంధువుల ఇంటి చుట్టూ మద్యం సేవించి తిరుగుతున్నాడు. ఆమె వచ్చిన విషయం తెలుసుకుని మంగళవారం ఇంటికి వెళ్లి సీతనపల్లి వెళ్లిపోదాం రమ్మని అడగడంతో ఆమె నిరాకరించింది. దీంతో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. అప్పటికే పథకం ప్రకారం వెంట తెచ్చుకున్న కత్తితో ఏసోబు ఆమెపై దాడి చేస్తుండగా ఆమె తన కుడిచేతిని అడ్డు పెట్టడడంతో వేళ్ళ మధ్య భాగం తెగింది. దీంతో ఏసోబు ఎడమచేతిపై మరో వేటు వేయగా తీవ్ర గాయమైంది. ఆమె బిగ్గరగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు రాగా ఏసోబు అక్కడి నుంచి పారిపోయాడు. దీంతో బాధితురాలి కుమార్తె, బంధువులు కలసి ఆమెను కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం ఆమెను మెరుగైన చికిత్స కోసం ఏలూరు తీసుకువెళ్లారు. ఈ ఘటనపై కైకలూరు టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుమారుడి దౌర్జన్యం.. తండ్రి ఆత్మహత్య

కలిదిండి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన గొల్లగూడెంలో జరిగింది. మండలంలోని పోతుమర్రు పంచాయతీలో గొల్లగూడెంకి చెందిన కట్టా పెద్ద కృష్ణ (75) సోమవారం ఇంట్లో టీవీ చూస్తుండగా, కుమారుడు కట్టా సత్యనారాయణ కర్రతో టీవీని పగులకొట్టి 36 సెంట్లు భూమిని తన పేరిట రాయాలని ఒత్తిడి చేశాడు. అందుకు తండ్రి పెద్ద కృష్ణ నిరాకరించాడు. దీంతో కోపోద్రిక్తుడైన సత్యనారాయణ తీవ్ర పదజాలంతో తండ్రిని దూషించాడు. దీంతో మనస్తాపానికి గురైన పెద్ద కృష్ణ ఇంటి వరండాలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ వి.వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చర్చిలో నిద్రిస్తే ఇంటిని దోచేశారు

ముసునూరు: మండలంలోని అక్కిరెడ్డిగూడెంలో మంగళవారం తెల్లవారుజామున దుండగులు ప్రధాన రహదారి పక్కనే ఉన్న మూడిళ్లలో చోరీకి పాల్పడ్డారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఫైడిపాముల ఎబినేజర్, ఫైడిపాముల సుందర్‌సింగ్ అన్నదమ్ములు. వీరు తమ ఇంటి సమీపంలో ఒక చర్చిని నిర్మించి దాని నిర్వహణ చూస్తుంటారు. సోమవారం రాత్రి వీరు కుటుంబ సభ్యులతో సహా చర్చిలో ప్రార్థనలు చేసి అక్కడే నిద్రించారు. ఈ నేపథ్యంలో దుండగులు వీరిద్దరి ఇంటి తాళాలను కట్టర్‌తో కట్ చేసి, చోరీకి పాల్పడ్డారు. ఉదయం 5 గంటలకు వీరి కుటుంబసభ్యులు ఇంటికి వెళ్లగా తలుపులు తెరచి ఉండటం గమనించి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. నూజివీడు సీఐ కె.రామకృష్ణ, చాట్రాయి ఎస్‌ఐ డి.రామకృష్ణ, ఏఎస్‌ఐ బేగ్ దొంగతనం జరిగిన తీరును పరిశీలించి, చుట్టుపక్కల విచారణ జరిపారు. చోరీ జరిగిన ఇళ్ళ పక్కన రహదారి చివర చర్చి చందా బ్యాగ్, పుస్తకాలు, చిల్లర నగదు పడి ఉండటం గుర్తించారు. ఏలూరు నుంచి క్లూస్ టీమ్‌ను రప్పించి, ఆధారాలు సేకరించారు. ఈ చోరీల్లో బాధితులు ఎబినేజర్ ఇంట్లో సుమారు 15 కాసులు బంగారు ఆభరణాలు, రూ. 30 వేలు నగదు, సుందర్ సింగ్ ఇంట్లో రూ. 30 వేలు నగదు చోరీకి గురైనట్టు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రామకృష్ణ తెలిపారు. కాగా మరో ఘటనలో దివంగత త్రిపురనేని రత్నప్రసాద్ ఇంటిలో ఆయన భార్య ఒక్కరే ఉంటున్నారు. ఆమె నిద్రిస్తుండగా ఇంటి తాళాలు పగులగొట్టి చోరీకి యత్నించిన దుండగులకు అక్కడ ఏమీ దొరకలేదని సమాచారం.

పానకంలో మత్తు మాత్రలు కలిపి గొలుసు కాజేశాడు...

ముసునూరు: పానకంలో మత్తు మాత్రలు కలిపి ఇచ్చి మహిళ మెడలో బంగారు గొలుసు అపహరించుకుపోయిన ఘటనపై ముసునూరు పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని వలసపల్లి గ్రామానికి చెందిన బండారుపల్లి జయలక్ష్మి ఒంటరిగా జీవిస్తోంది. 15 రోజులు క్రితం ఆమె పక్కింట్లోకి గుంటూరు జిల్లాకు చెందిన వెంకట్ అనే వ్యక్తి అద్దెకు దిగాడు. అతడు బాధితురాలితో పరిచయం పెంచుకున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 24న తనకు ప్రమోషన్ వచ్చిందని, మంగళగిరి పానకాల స్వామి గుడికి వెళ్ళి మొక్కు తీర్చుకుని వచ్చానని, పానకం ప్రసాదం ఇచ్చాడు. ఈ పానకం తాగిన కొద్ది క్షణాలకు జయలక్ష్మి స్పృహకోల్పోయింది. ఆమె మెడలో ఉన్న 8 కాసుల బంగారు గొలుసును దొంగిలించి వెంకట్ పరారయ్యాడు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ బేగ్ తెలిపారు. నూజివీడు సీఐ కె.రామకృష్ణ ఆధ్వర్యంలో నిందుతుడిని గుర్తించి, పట్టుకునేందుకు ప్రత్యేక పోలీస్ బృందాలు గాలిస్తున్నట్లు ఆయన తెలిపారు.

వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ

ముదినేపల్లి: ముదినేపల్లి మండలం గురజ గ్రామం వద్ద రహదారి పక్కన గేదెలను మేపుకుంటున్న ఓ వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును దుండగులు తెంచుకుని పారిపోయిన సంఘటన ఇది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన గజరావు మాణిక్యమ్మ మంగళవారం సాయంత్రం ఇసుక కాలువ వద్ద గేదెలను మేపుకుంటుండగా ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు యువకులు ఆమె మెడలోని సుమారు రెండు కాసుల బంగారు గొలుసును తెంచుకుని పారిపోయారు. దీనిపై మాణిక్యమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ వీరభద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇటీవలి కాలంలో ఇటు వంటి గొలుసు చోరీలు జరగడం పరిపాటి అయ్యింది.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

కైకలూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కైకలూరు-ఏలూరు ఆర్అండ్‌బీ రహదారిలో మద్యం దుకాణాల సమీపంలో ద్విచక్ర వాహనాన్ని కారు వెనుక నుంచి స్వల్పంగా ఢీకొట్టింది. ఏలూరుజిల్లా పెదపాడు గ్రామానికి చెందిన కొండపు నాగరాజు, భార్య వెంకట రమణతో కలిసి ద్విచక్ర వాహనంపై మంగళవారం ఉదయం భీమవరంలోని కుమార్తె వద్దకు వెళ్లారు. సాయంత్రం తిరిగి కైకలూరు మీదుగా ఏలూరు వెళుతుండగా కైకలూరులో వెనుక నుండి కారు ఢీకొట్టింది. దీంతో వారు రోడ్డుపై పడడంతో వెంకట రమణ తలకు తీవ్రగాయాలు కాగా భర్త నాగరాజుకు స్వల్ప గాయాలు అయ్యాయి. స్థానికులు కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స కొరకు ఏలూరు తీసుకువెళ్లారు.